ఆంధ్రజ్యోతి

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 18 మార్చి 2024





అవినీతిలో మంత్రుల పోటీ



రాష్ట్రంలో అవినీతి సర్కారుకు చరమగీతం పాడాలి. ఏపీ మంత్రులు అవినీతి, అక్రమాల్లో ఒకరిని మించి మరొకరు పోటీ పడుతు న్నారు. ఆంధ్ర రాష్ట్ర వికాసానికి చంద్ర బాబు, పవన్ కల్యా ణ్ చేసిన కృషిని, వారి పోరాటాన్ని గుర్తించాలి. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత మెండుగా ఉం దని.. మిమ్మల్ని చూస్తుంటే అర్థమ వు తోంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేం దుకే ఎన్నో సంస్థలు స్థాపించాం. ఏపీలో నీలి విప్లవా నికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. రాష్ట్రంలో ఎన్డీయే సర్కారుకు ప్రజలు అధికారం ఇస్తే మహి ళలు, యువతకు కొత్త అవకాశాల సృష్టికి ప్ర ణాళికలు ఏర్పడతాయి.

ప్రజా సంక్షేమమే అజెండా



ప్రజల గుండె చప్పుడు బలంగా వినిపించడానికే మూడు పార్టీలు జట్టు కట్టాయి. సంక్షేమం, అభివృద్ధి, ప్రజా స్వామ్య పరిరక్షణే కూట మి లక్ష్యం. జెండాలు వేరైనా.. అజెం డా ప్రజా సంక్షేమమే. రాష్ట్రం నిలబడాలి. మన బిడ్డలు వెలగాలి. రాష్ట్రాన్ని కాపాడు కోవాలి. ప్రజలు గెలవాలి. రాష్ట్రం నిలబడాలి. రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవాలి. అందుకే ఈ పొత్తు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణ యిస్తుంది.

కూటమిదే పీఠం



రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నాం. అభివృద్ధి లేక అప్పులతో నలిగిపోతున్న ప్రజలకు మోదీ రాక బలా న్నిచ్చింది. అమరా వతికి అండగా ఉంటానని చెప్పేందు కే ప్రధానమంత్రి వ చ్చారు. రాబోయే కా లంలో అమరావతి దేదీ ప్యమానంగా వెలగ బో తోం ది. అయోధ్యలో రామాలయం కట్టిన మోదీకి.. రాష్ట్రాన్ని రావణ కాష్టం చేసిన రావణాసు రుడ్ని తీసేయడం కష్టం కాదు. ధర్మానిదే విజయం.. పొత్తుదే గెలుపు.. కూటమిదే పీఠం.

ప్రజాగళం

ప్రభంజనం





సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి

- అన్ని దారులూ బొప్పూడి వైపే
- ఉదయం నుంచే తరలివచ్చిన జనసందోహం
- లక్షలాదిగా కదిలివచ్చిన కూటమి శ్రేణులు, అభిమానులు
- ఐదు కిలోమీటర్ల మేర అటూ, ఇటూ నిలిచిపోయిన వాహనాలు
- మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రసంగాలతో హోరెత్తిన జనస్పందన



- సభలో ప్రసంగిస్తున్న కృష్ణదేవరాయలు, పుల్లారావు, గాదె, సత్యకుమార్

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివా రం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొ ప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లిం ది. బొప్పూడికి ఇటు చిలకలూరి పేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనం తో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొ ప్పూడి వైపు కదలిరావడంతో జాతీ య రహదారిపై జన సునామీ ఆవి ష్కృతమైంది. చలో బొప్పూడి అం టూ కార్యకర్తలు, నేతలు, అభిమా నులు ఒక ప్రవాహంలా తరలిరావ డంతో మధ్యాహ్నం మూడు గంట లకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జన సునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదిక గా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్ని కల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వా మిక పాలనకు అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభి వృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకా రం చేసుకోవాలని సందేశ మిచ్చారు. - చిలకలూరిపేట

చిలకలూరిపేట(నరసరావుపేట), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు మండే ఎండ.. మరోవైపు జనసునామీ. సూర్యుడి భగభగలను ఖాతరు చేయకుండా జనం ఉప్పెనలా తరలివచ్చారు. పల్నాడు జిల్లా బొప్పూడి వద్ద ఆదివారం జరిగిన ప్రజాగళం సభ జన ప్రవాహంతో ప్రభంజనమైంది. లక్షలాదిగా తరలివచ్చిన జనంతో సభా ప్రాంగణం కిటకిటలాడిపోయింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఉదయం నుంచే జనం సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కూటమి కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలివచ్చారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలే కాకుండా సాధారణ ప్రజలు కూడా స్వచ్ఛందంగా కదలిరావడంతో సభా ప్రాంగణం జనసాగరాన్ని తలపించింది. బొప్పూడికి ఇటు చిలక లూరిపేట, అటు మార్టూరు వరకు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. ట్రాఫిక్‌లో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవ డంతో కిలోమీటర్ల దూరం నడిచి మహిళలు, వృద్ధులు సైతం సభా ప్రాంగణానికి చేరుకున్నారు. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదిలారు. మధ్యాహ్నానికి ప్రాంగణం కిక్కిరి సిపోయింది. ఆ తర్వాత వచ్చిన వారంతా జాతీయ రహదారిపై నిలిచిపోయారు. లక్షలాది మంది వాహనాల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. అంచనాలకు మించి జనం రావడంతో కూటమి నేతలు, శ్రేణుల్లో సమరోత్సాహం నెలకొంది. పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి యువకులు వేలాది ద్విచక్ర వాహనాలతో ప్రద ర్శనగా చేరుకున్నారు. సభలో అధినేతల ప్రసంగించే సమయానికి ఇసుకే స్తే రాలనంతగా జనంతో కిటకిటలాడింది. బీజేపీతో టీడీపీ-జనసేన పొత్తు కుదిరాక నిర్వహించిన సభకు జనం పోటెత్తడంతో కూటమి శ్రేణుల్లో సరి కొత్త ఉత్సా హాన్ని నింపింది. మోదీ ప్రసంగం తర్వాత కూడా సభకు జన ప్రవాహం కొనసాగడం గమనార్హం. ట్రాఫిక్ స్తం భించిపోవడంతో ప్రాంగణానికి చేరకుండానే వెనుదిరిగాల్సి రావడంతో పలువురు అసంతృప్తి చెందారు. ట్రాఫిక్ క్రమ బద్ధీకరించడంలో పోలీసు శాఖ ఘోరంగా విఫలమైందని నేతలతో పాటు, ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఉద్దేశ పూర్వకంగానే పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించలేదన్న అను మానాలను నేతలు వ్యక్తం చేశారు. పోలీసుల నిర్వాకంతో సభా ప్రాంగణం వెలుపల సగానికిపైగా జనం నిలిచిపోవాల్సి వచ్చింది.

అపూర్వ స్పందన..

ప్రజాగళం సభకు అపూర్వ స్పందన వచ్చింది. ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రసంగాలు ఆద్యంతం సభికులను ఆకట్టుకున్నాయి. జగన్ మోసాలను అధినేతలు ఎండగట్టిన తీరు.. జగన్‌పై చేసిన విమర్శలకు జనం నుంచి అనూహ్య స్పందన లభించింది. వారి ప్రతి మాటా తూటాలా పేలింది. రాష్ట ప్రభుత్వం సాగించిన అరాచకాలు, అవినీతి, అక్రమాలపై అధినేతలు సూటిగా జనం ముందుంచారు. ఐదేళ్లలో జనానికి జరిగిన అన్యాయాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. ప్రజ ల జీవన ప్రమాణాలు వైసీపీ పాలనలో ఎలా దెబ్బతిన్నాయో సమగ్రంగా వివరించారు. సైకో జగన్‌ను ఇంటికి సాగనం పడానికి సిద్ధమా అని నేతలు ప్రశ్నిం చగా రెడీ అంటూ సభకు వచ్చిన లక్షలా దిగా జనం నినాదాలతో హోరె త్తించారు.



కళాకారుల విన్యాసం



ట్రాక్టర్లపై సభకు తరలివెళుతున్న యువత



రాజధాని రైతుల జై అమరావతి నినాదాం



మహిళామణుల కేరింతలు





పోలీసుల ఆంక్షలతో పొలాల్లో నుంచి సభకు తరలి వెళుతున్న ప్రజలు



తొక్కిసలాటలో గాయపడ్డ కార్యకర్తకు కట్టుకడుతున్న వైనం

సామాన్యుడి మాట

ప్రభుత్వంపై వ్యతిరేకతను ఇలా వ్యక్తం చేస్తూ..



- విజిలేస్తూ... ఉత్సాహం

తొడకొడుతున్న మహిళాభిమాని

స్కూటర్లపై ఉమ్మడి పార్టీల జెండాలతో కార్యకర్తలు

దిక్సూచి
DIKSUCHI



ఇమ్యూనాలజీలో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ(ఎన్ఐఐ)- పీహెచ్‌డీ 2024-25 మాన్‌సూన్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్/జేజీఈఈబీఐఎల్ఎస్ 2024 స్కోర్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.37,000ల జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) ఇస్తారు.

స్పెషలైజేషన్లు: ఇమ్యూనాలజీ, ఇన్ఫెక్షియస్ అండ్ క్రానిక్ డిసీజ్ బయాలజీ, మాలిక్యులర్ అండ్ సెల్యులర్ బయాలజీ, కెమికల్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ(బయాలజీ/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/ఎంటెక్/ఎంబీబీఎస్/ఎంఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 60 శాతం మార్కులు, పీజీ స్థాయిలో 55 శాతం మార్కులు ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 25
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 8 నుంచి
- **ఎన్ఐఐ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** ఏప్రిల్ 28
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 6న
- **మొదటి రౌండ్ ఇంటర్వ్యూలు:** జూన్ 4, 6
- **రెండో రౌండ్ ఇంటర్వ్యూలు:** జూన్ 10, 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nii.res.in

సీసీఎంబీలో పీహెచ్‌డీ

హైదరాబాద్-హబ్సిగూడలో సీఎస్ఐఆర్ నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మోడ్రన్ బయాలజీలో పరిశోధనలు చేయాలనుకొనే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: సెల్ బయాలజీ, మాలిక్యులార్ బయాలజీ, జెనెటిక్స్, జినోమిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ, ప్లాంట్ మాలిక్యులార్ బయాలజీ, కన్జర్వేషన్ బయాలజీ, ఎకాలజీ, ప్రొటీన్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, బయాలజీ ఆఫ్ మాక్రోమాలిక్యూల్స్ బయాలజీ ఆఫ్ ఇన్ఫెక్షన్, ఇమ్యూనాలజీ, ఎపిజెనెటిక్స్, క్రోమాటిన్ బయాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్.

అర్హత: సైన్స్ విభాగాల్లో ఏదేని మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. యూజీసీ/సీఎస్ఐఆర్/డీబీటీ/డీఎస్‌టీ/ఐసీఎంఆర్/డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పైయిర్/ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి. పీహెచ్‌డీ పూర్తయ్యేవరకూ ఫెలోషిప్ వ్యాలిడిటీ ఉండాలి.



ఎంపిక: ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలించి స్క్రీనింగ్ చేసిన అభ్యర్థులను కంప్యూటర్ బేస్డ్/రిమోట్ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్‌కు పిలుస్తారు. ఇందులో అర్హత పొందినవారికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. సీఎస్ఐఆర్/యూజీసీ నెట్ లెక్చరర్‌షిప్ అర్హత మాత్రమే ఉన్న వారిని ఇంటర్వ్యూకి అనుమతించరు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 22
- **ఇంటర్వ్యూ సెంటర్:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** ccmb.res.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ముంచుకొస్తున్న మంచు రహిత స్థితి

ప్రమాదంలో భూగోళం



భూమికి ఉన్న రెండు ధ్రువాల్లో మంచు ఫలకాలతో పాటు అతిశీతల వాతావరణం ఉంటుంది. భూమిపై ఉన్న మంచినీటిలో 70 శాతం వరకు ఈ ఉత్తర, దక్షిణ ధ్రువాల్లోని పోలార్ ఐస్ క్యాప్ ప్రాంతాల్లో మంచు ఫలకాలుగా గడ్డకట్టి ఉంది. ఇంత భారీస్థాయిలో పేరుకొని ఉన్న ఈ మంచు, ప్రపంచ పర్యావరణం సమతౌల్య స్థితిలో ఉండడానికి కారణమౌతోంది. నిర్దిష్టంగా పరిశీలిస్తే ఒక్కో ధ్రువ భాగం ఒక్కో రీతిలో తమ ప్రభావాన్ని విలక్షణంగా భూమిపై చూపుతుంటాయి. ఇదంతా ఇరు మంచు ధ్రువాలు తమదైన సహజ స్థితిలో ఉన్నప్పటి మాట. కానీ నేడు మానవ కార్యకలాపాల వల్ల భూతాపం పెరిగి ఉత్తర, దక్షిణ ధ్రువాల్లోని మంచు వేగంగా కరిగిపోతోంది. ఈ కారణంగా అనేక పర్యావరణ సమస్యలతోపాటు అంతిమంగా భూమిపై జీవరాశి మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి గోచరిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్కిటిక్(ఉత్తర), అంటార్కిటిక్(దక్షిణ) ధ్రువాలు తమదైన రీతిలో భూ వాతావరణం, పర్యావరణాలకు ఏవిధంగా సహకరిస్తున్నాయి? భూతాపం పెరగడం వల్ల అవి ఏవిధంగా విపరిణామాలను సంధించబోతున్నాయి? పరిస్థితిని తక్షణమే చక్కబరచేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏవి? వంటి అంశాల కోణంలో ఒక అవగాహన ఏర్పరచుకోవాల్సిన అవసరం ఉంది.

- ప్రపంచ జనాభాలో దాదాపు 90 శాతం మంది ఉత్తరార్ధ గోళంలోని దేశాల్లో జీవిస్తున్నారు. అందువల్ల ఈ ప్రాంతంలోని దేశాలపై ఉత్తర ధ్రువ ప్రాంతంలోని ఆర్కిటిక్ మంచు మహాసముద్ర ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దక్షిణార్ధ ధ్రువంలోని అంటార్కిటికా మంచు ఖండం వలె కాక ఆర్కిటిక్ ప్రాంతపు స్నో క్యాప్ అనేది సముద్రంపై తేలియాడే మంచు ఫలకాల రూపంలో ఉంటుంది. కాబట్టి ఈ ప్రాంతంలో అంటార్కిటికాతో పోలిస్తే జీవరాశి మనుగడ ఎక్కువ. ఈ మంచు ఫలకాలు అతిశీతల ఉపరితల గాలులను కింద ఉన్న వెచ్చటి సముద్ర జలాలకు చేరకుండా అడ్డుకోవడం వల్ల అక్కడ భారీ స్థాయిలో జలచరాలు జీవించగల్గుతున్నాయి. నార్వే, డెన్మార్క్, కెనడా, అమెరికా, రష్యా వంటి తీర దేశాలు ఈ ప్రాంతపు మత్స్య సంపదపై భారీగా ఆధారపడి ఉన్నాయి. ప్రపంచ మత్స్య సంపదలో దాదాపు 10 శాతం ఈ ప్రాంతంలోనే ఉందని అంచనా! అంతేకాక ఈ ఉత్తర ధ్రువ ప్రాంతపు జెట్‌స్ట్రీమ్స్ ఉత్తర అమెరికా, పశ్చిమ యురోపియన్ దేశాల వాతావరణం, వర్షపాతంపై విశేష ప్రభావాన్ని చూపుతాయి. అదే విధంగా దక్షిణ ధ్రువ ప్రాంతపు జెట్‌స్ట్రీమ్స్ ప్రభావం కూడా ఉత్తరార్ధ గోళంపై విశేషంగా ఉంటుంది. ముఖ్యంగా భారతదేశానికి వర్షపాతం అందించే రుతుపవన వ్యవస్థ రూపుకట్టడంలో ఈ జెట్‌స్ట్రీమ్స్ పాత్ర కీలకం. ఉత్తరార్ధగోళంలోని మధ్య అక్షాంశ ప్రాంతాల్లో వాతావరణ సమతౌల్యానికి హీట్‌వేవ్స్‌ను అడ్డుకోవడంలో ఆర్కిటిక్ ప్రాంత శీతల గాలులు సహకరిస్తాయి.

'కొలరాడో' పరిశోధనల్లో దిగ్భ్రాంతికర విషయాలు

- ఇటీవల కొలరాడో విశ్వవిద్యాలయ పరిశోధకులు ఆర్కిటిక్ ప్రాంతంలో దశాబ్దాలుగా చేపట్టిన పరిశోధనల నివేదిక ఆ ప్రాంతంలో మార్పులపై దిగ్భ్రాంతికర అంశాలు వెల్లడించింది. 2050 నాటికి ఆర్కిటిక్ మహాసముద్రంలో ఒక నెల పాటు వేసవికాలంలో సముద్ర జలాలపై మంచు కనుమరుగైపోనుందని ఈ నివేదిక తెలిపింది. ఆర్కిటిక్ సముద్రంలో తేలియాడే సముద్రపు మంచు ఒక చదరపు కిలోమీటరు విస్తీర్ణం కంటే తక్కువగా ఉంటే దాన్ని 'మంచు రహితం(ఐస్ ఫ్రీ కండిషన్)'గా పరిశోధకులు చెబుతారు. అదేవిధంగా ఈ పరిస్థితి, ఈ శతాబ్దం చివరి నాటికి కొన్ని నెలలపాటు ఏర్పడవచ్చని భావిస్తున్నారు. దీనికి కారణం ఆర్కిటిక్ ధ్రువ ప్రాంతంలోని సముద్ర జలాలు మిగతా భూగోళం కన్నా మూడు రెట్లు ఎక్కువగా వేడెక్కుతుండడం వల్ల మంచు వేగంగా కరిగిపోవడమేనని పరిశోధకులు చెబుతున్నారు.
- 1979తో పోలిస్తే గత ఏడాది సెప్టెంబరులో ఆర్కిటిక్ సముద్రంలో 2.6 మిలియన్ చదరపు కిలోమీటర్ల మేర సముద్ర మంచు విస్తీర్ణం తగ్గిందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితులు ఆ ప్రాంతంలో జీవించే మంచు ఎలుగుబంట్లు, వాల్‌రస్, రెయిన్ డీర్స్ వంటి జీవుల ఆహార వేట, సంతానోత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతాయి.
- ధ్రువ ప్రాంతాల్లో మంచుతో కప్పిన నేల(పెర్మా ఫ్రాస్ట్) కింద బందీ అయిన మీథేన్ వాయువు, మంచు కరిగిపోవడం వలన భారీస్థాయిలో వాతావరణంలోకి విడుదలవుతుంది. దీనివల్ల ప్రపంచ భూతాపం మరింత పెరిగి విపత్కర పరిస్థితులకు దారి తీస్తుంది. కార్చిచ్చులు విజృంభిస్తాయి. వర్షాభావ పరిస్థితులు, కరవులు వంటి వాతావరణ విపత్తులు ప్రపంచ దేశాలను చుట్టుముడతాయి. సముద్ర ఉష్ణోగ్రతలను అదుపు చేసే ఆర్కిటిక్ శీతల వాతావరణం గాడి తప్పడంవల్ల సముద్ర ప్రవాహాలు వేడెక్కి, అలల ఉధ్రుతి పెరిగి తీరప్రాంతాలు భారీగా కోతకు గురవుతాయి. సముద్రాల ఉష్ణోగ్రతలు పెరిగి జలచరాలు మరణిస్తాయి. దీనితో సముద్ర పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. మత్స్యసంపద తగ్గిపోయి వాటిపై ఆధారపడే దేశాలు, ప్రజలు ఆర్థిక, ఆహార సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.
- మంచు భారీ స్థాయిలో కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరిగి తీరప్రాంత నగరాలు, దీవుల దేశాలు మునిగిపోతాయి. వేసవిలో తెల్లని ఆర్కిటిక్ మంచు కరగిపోతే దాని కింద ఉన్న నల్లని సముద్ర జలాలు నల్లని దుస్తుల మాదిరిగా సూర్యకాంతిని శోషించుకోవడం వల్ల భూ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మంచు పేరుకుంటే అది భూమి/నీటి కంటే ఎక్కువ స్థాయిలో సూర్యకాంతిని పరావర్తనం చెందించడం(ఆల్బిడో) వల్ల ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ప్రపంచ ఉష్ణోగ్రతల ప్రభావం కారణంగా దక్షిణార్ధ గోళం(అంటార్కిటికా ప్రాంతం)లో కూడా మార్పులు సంభవిస్తున్నాయి. నిజానికి ఈ ప్రాంతంలో భూప్రాంతం తక్కువ. సముద్ర పరివేష్టితం ఎక్కువ. అయినప్పటికీ ఉత్తరార్ధ గోళంలో మితిమీరి పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, శిలాజ ఇంధన ఉద్గారాలు వంటివి దక్షిణార్ధ గోళంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమంలో భారీస్థాయిలో దక్షిణ ధ్రువంలో ఘనస్థితిలో మేటవేసి ఉన్న భారీ హిమఖండంలో ఏ మాత్రం మార్పులు వచ్చినా సముద్ర మట్టాలు భారీగా పెరుగుతాయి. దీనితో ప్రపంచదేశాల తీరప్రాంతాలన్నింటిపై ప్రభావం పడుతుంది. మడ అడవుల వంటి తీరప్రాంతాల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల తుఫానుల తీవ్రత, సంభావ్యత పెరుగుతుంది. పంటల నష్టం, రుతుపవనాలు గాడి తప్పడం, ఆహార సంక్షోభం ఏర్పడతాయి.

అక్కడ ఖనిజాల వెలికితీత ప్రమాదం

- ఆర్కిటిక్ ప్రాంతంలో సముద్ర మంచు కరగడం అంటే సముద్రయానానికి సౌలభ్యం కలగడమే. ఈ ప్రాంతంలో భారీస్థాయిలో ఇంధన, ఖనిజ నిక్షేపాలు ఉండడం వల్ల అమెరికా, చైనా వంటి అగ్ర రాజ్యాల కన్ను ఇప్పటికే అక్కడ ఉంది. ఈ ఆర్కిటిక్ ప్రాంత సముద్రమార్గాలను సైతం చైనా, అమెరికా వ్యూహాత్మకంగా అభివృద్ధి పరచుకుంటున్నాయి. కొన్ని నెలలపాటు ఈ ప్రాంతాల్లో మంచు రహిత స్థితి కొనసాగడమంటే అక్కడి ఖనిజాల దోపిడీకి అగ్రరాజ్యాలకు దారివ్వడమే. ఆర్కిటిక్ పరివేష్టిత దేశాలన్నీ ఈ సరిహద్దు ఉద్రిక్తతల్లో భాగమవుతాయనడంలో సందేహం లేదు. ఖనిజాల వెలికితీత ప్రక్రియ ఆర్కిటిక్ ఆవరణ వ్యవస్థపై మరింత దుష్ప్రభావం చూపి ప్రపంచ పర్యావరణాన్ని తీవ్రంగా నష్టపరుస్తుంది. ఇది క్రమంగా మానవాళి మనుగడనే సందేహాస్పదం చేస్తుంది.
- 1800 నాటితో పోలిస్తే భూ ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌లకు కట్టడి చేయాలనీ లేదా కనీసం ఆ పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్‌ల లోపే ఉండేలా చూడాలని పారిస్ ఒప్పందం నిర్దేశిస్తోంది. కానీ ఆ 1800 నాటితో పోలిస్తే ఆర్కిటిక్ ప్రాంత ఉష్ణోగ్రతలో ఇప్పటికే 2 డిగ్రీల సెల్సియస్ పెరుగుదల కనిపిస్తోందని పరిశోధకులు వెల్లడిస్తున్నారు. ఈ పరిస్థితి అత్యవసర దిద్దుబాటు చర్యల కోసం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది.
- ఉపగ్రహ అంచనాల ప్రకారం ఏటా ఆర్కిటిక్ ప్రాంతంలో 13 శాతం చొప్పున మంచు కరగిపోతోంది. దీనికి 90 శాతం కారణం మానవ చర్యలే. శిలాజ ఇంధన వాడకం, పరిశ్రమల ఉద్గారాలను తగ్గించే దిశగా పారిస్ ఒప్పందం, సీఓపీ-28 తీర్మానాలను నిబద్ధతతో ప్రపంచ దేశాలన్నీ ముఖ్యంగా పారిశ్రామిక దేశాలు అమలుపరచాలి. ఆర్కిటిక్ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు, ఖనిజాన్వేషణ ప్రయత్నాలను నిషేధిస్తూ పటిష్ఠ ఒప్పందాలు రావాల్సిన ఆవసరం ఉంది. ఇటీవల ఆర్కిటిక్ సముద్ర తీర దేశాలు మధ్య ఆర్కిటిక్ ప్రాంత భౌగోళిక సున్నితత్వం దృష్ట్యా జలచరాల వేటను, ఫిషింగ్ కార్యకలాపాలను ఆ ప్రాంతంలో నిషేధిస్తూ ఒక ఒప్పందానికి వచ్చాయి. ఇటువంటి ఒప్పందాలు ఉష్ణోగ్రతల కట్టడి విషయంలో కూడా రావాల్సి ఉంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'కోడ్' మీకే.. మాక్కాదు!

- ఇదీ.. సీఎం జగన్ తీరు
- ఫైబర్ నెట్‌లో బరితెగించి ప్రచారం
- ఎన్నికల సంఘానికి అచ్చెన్న ఫిర్యాదు



పార్వతీపురంలో ఆదివారం ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ ఉన్న ఇంటిలో టీవీ ఆన్ చేయగానే దర్శనమిచ్చిన సీఎం జగన్ ప్రచార చిత్రాలు

పార్వతీపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి), అవనిగడ్డ: దేశవ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఏపీలో అయితే.. ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కోడ్‌ను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ప్రకటించాయి. కానీ, వైసీపీ ప్రభుత్వం మాత్రం "కోడ్ మీకే కానీ.. మాక్కాదు!" అన్నట్టుగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర సర్కారు అధీనంలోని ఫైబర్ నెట్‌లో యథేచ్ఛగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఊదరగొడుతోంది. సీఎం జగన్ ఫొటోలు, ఆయన విద్వేషపూరిత ప్రసంగాలను ప్రసారం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లక్షల సంఖ్యలో ఫైబర్ నెట్ కనెక్షన్లు ఉన్నాయి. ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థ. ఇప్పటి వరకు దీనిలో ఎలాంటి కార్యక్రమాలు ప్రసారం అయ్యాయనేది పక్కన పెడితే.. కోడ్ అమల్లోకి వచ్చాక.. ప్రభుత్వ పార్టీ ప్రయోజనాలను పక్కన పెట్టాల్సిన అవసరం ఉంది. అయితే.. వైసీపీ ప్రభుత్వం కోడ్‌ను తూచ్ అంటోంది. మాకు వర్తించదని తన చర్యల ద్వారా స్పష్టం చేస్తోంది. ఫైబర్‌నెట్‌లో అధికార పార్టీ అనుకూల ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పలు ప్రాంతాల్లో ఏపీఫైబర్ నెట్‌లో వైసీపీ ప్రభుత్వ పథకాలు, సీఎం జగన్ ముఖచిత్రాలు, ఆయన ప్రసంగాలు విస్తృతంగా ప్రసారమయ్యాయి. అదేవిధంగా మంత్రి గుడివాడ అమర్నాథ్, ఫైబర్ నెట్ లిమిటెడ్ ఛైర్మన్ గౌతంరెడ్డి చిత్రాలు పదేపదే ప్రసారమయ్యాయి. రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో వచ్చిన వ్యూహం సినిమా పార్ట్-1, పార్ట్-2ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని ప్రచారం చేశారు. చిత్రం ఏంటంటే ఇతర టీవీ చానళ్లను నిలిపివేసి.. వీటినే ప్రసారం చేయడం! ఇలా కోడ్‌ను ధిక్కరించి మరీ సర్కారు పెద్దలు ప్రచారం చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు చేయడంతో సాయంత్రానికి వైసీపీ సర్దుకుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ ఉన్న ప్రతిఇంట్లో ఆదివారం టీవీ ఆన్ చేయగానే.. సీఎం జగన్ ఫొటోనే దర్శనమిచ్చింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రసారమయ్యాయి. ప్రతిపక్ష నాయకులపై విమర్శలు గుప్పిస్తూ.. సీఎం జగన్ చేసిన ప్రసంగాలను ప్రసారం చేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఇలా వైసీపీ పథకాలను ప్రసారం చేయడంపై జిల్లావాసులతో పాటు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు నివ్వెరపోయారు. ఇది ముమ్మాటికీ కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని వారు పేర్కొన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, నేతల ఫ్లెక్సీలను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు తొలగిస్తున్నారు. విగ్రహాలకు కూడా ముసుగులు వేస్తున్నారు. అలాంటిది.. ఏపీ ఫైబర్ నెట్ ద్వారా అధికార పార్టీ బరితెగించి తమ పథకాలను ప్రసారం చేయడంపై రాజకీయ పక్షాలు మండిపడుతున్నాయి.



ఏపీ ఫైబర్ నెట్‌లో జగన్, మంత్రి గుడివాడ అమర్నాథ్, ఫైబర్ నెట్ ఛైర్మన్ గౌతంరెడ్డి చిత్రాలు

ఆపించండి: టీడీపీ ఫిర్యాదు

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫైబర్‌నెట్‌లో జగన్ చిత్రాలు, ప్రసంగాలు ప్రసారం చేయడం ఎన్నిక నియమావళికి విరుద్ధమని, వెంటనే వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు లేఖ రాశారు. ఫైబర్‌నెట్ అధికారులకు ఆ మేరకు ఆదేశాలివ్వాలని కోరారు. అదేవిధంగా వ్యూహం సినిమాను అదే పనిగా ప్రసారం చేస్తున్నారని, ఆ సినిమా ప్రసారాన్ని కూడా నిలిపేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం జగన్ బొమ్మను తొలగించాలని, కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. అదేవిధంగా ఏపీఎస్ఎఫ్ఎల్ పాల్పడుతున్న అధికార దుర్వినియోగంపై టీడీఎల్‌పీ కార్యదర్శి కోనేరు సురేష్ ఆదివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనాకు ఫిర్యాదు చేశారు. ఫైబర్ నెట్‌లో ప్రసారమవుతున్న ప్రభుత్వ ప్రకటనలను నిలుపుదల చేయించాలని, ఉద్దేశ పూర్వకంగా బ్లాక్ చేసిన వార్తా చానళ్లను ఫైబర్ నెట్‌లో వెంటనే ప్రసారమయ్యేలా ఆదేశించాలని కోరారు.

ఫ్లెక్సీల తొలగింపులో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో సచివాలయ ఉద్యోగి, విద్యార్థి దుర్మరణం
- విశాఖ, సిక్కోలు జిల్లాల్లో విషాదం..

దేవరాపల్లి, హరిపురం, మార్చి 17: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు.. విధి నిర్వహణలో భాగంగా రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు తొలగిస్తుండగా విశాఖ జిల్లా దేవరాపల్లి మండలంలో గ్రామ సచివాలయ ఉద్యోగి ఒకరు విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా హరిపురంలో ఫ్లెక్సీ తొలగిస్తుండగా ఐటీఐ చదువుతున్న విద్యార్థి కూడా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర కథనం మేరకు.. విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లికి చెందిన డెక్క చిరంజీవి(34) దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కోడ్ అమల్లోకి రావడంతో బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను ఆదివారం సాయంత్రంలోగా తొలగించి, ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కిందిస్థాయి ఉద్యోగులకు మండల అధికారులు హుకుం జారీ చేశారు. కొత్తపెంట సచివాలయం పరిధిలో ఫ్లెక్సీలు తొలగించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్ డెక్క చిరంజీవి తన స్నేహితుడు దాసరి శ్రీనుతో కలిసి ద్విచక్రవాహనంపై ఉదయం 8గంటలకు ములకలాపల్లి గ్రామానికి చేరుకున్నాడు. పాల కేంద్రానికి సమీపంలో ఉన్న ఒక ఫ్లెక్సీని చిరంజీవి తొలగిస్తుండగా.. దీని ఇనుపచట్రం, పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీప పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు వెంటనే వచ్చి, ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో ఇసుక తీసుకువచ్చి అతడి శరీరంపై పోశారు. వెంటనే సమీపంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బందిని రప్పించగా, వారు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. మృతుడు చిరంజీవికి భార్య హేమలత, పిల్లలు చేతన్(6), ఇషాన్(3), తల్లి కృష్ణమ్మ ఉన్నారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా మందస మండలం సిరిపురం గ్రామంలో వైసీపీకి చెందిన కటౌట్లు తొలగిస్తుండగా విద్యుత్తు షాక్‌కు గురై ఐటీఐ విద్యార్థి బోంద్ర శివశంకర్(21) మృతి చెందాడు. ఎన్నికల కోడ్ రావటంతో సిరిపురంలోని అధికార పార్టీకి చెందిన కటౌట్లు తొలగించే బాధ్యతను సంబంధిత పార్టీ నాయకులు యువకులకు అప్పగించారు. ఉదయం 9.30 గంటలకు శివశంకర్‌తో పాటు మరో ముగ్గురు యువకులు కలిసి కటౌట్లు తొలగిస్తుండగా.. ఐరన్ ఫ్రేమ్ ఉన్న ఓ కటౌట్ ప్రమాదవశాత్తూ విద్యుత్తు తీగలకు తగలడంతో శివశంకర్ షాక్‌కు గురయ్యాడు. అతడిని వెంటనే 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

అనుమతి లేని హోర్డింగులను తీసేయండి

- పోస్టర్లు, కటౌట్లను కూడా..: సీఈవో
- ఫ్లయింగ్ స్క్వాడ్లు రంగంలోకి దిగాలి
- రాష్ట్రవ్యాప్తంగా పటిష్ఠంగా కోడ్ అమలు
- ఇంకా ఎన్నికల విధుల్లో చేరని సిబ్బందిపై వెంటనే క్రమశిక్షణ చర్యలు
- అధికారులకు ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశం



అధికారులతో సమీక్షలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లను, పోస్టర్లు, కటౌట్లను తక్షణమే తొలగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ప్రత్యేకించి రాష్ట్ర సచివాలయ పరిసర ప్రాంతాల్లోను, కరకట్ట మార్గంలోనూ అనుమతి లేకుండా ఉన్న హోర్డింగ్‌లను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా తీసివేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను నిర్దేశించారు. ఇంకా విధుల్లో చేరని ఎన్నికల అధికారులపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు పరిచేందుకు జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆదివారం అమరావతి సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 'ఎన్నికల కోడ్ ప్రకారం.. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లోను 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లోనూ అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాల్సి ఉంది. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఈ నియమ నిబంధనలను పటిష్ఠంగా అమలుపరిచేలా చర్యలు తీసుకోవాలి. కొన్ని జిల్లాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు ఇప్పటి వరకూ అందకపోవడం వల్ల రాష్ట్ర ఎన్నికల నిర్వహణ ప్రణాళికను సమగ్ర స్థాయిలో రూపొందించలేకపోయాం. ఈ విషయంలో ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఈ (ఆదివారం) సాయంత్రంలోపు మా కార్యాలయానికి జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలను పంపాలి. సీ-విజిల్‌కు అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు, ఎన్నికల సంఘం నుంచి అందే ఫిర్యాదులపై అదే రోజు, మీడియాలో ప్రచురితమయ్యే, ఇతర ఫిర్యాదులపై 24 గంటల్లో చర్యలు చేపట్టాలి' అని పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టులో దాఖలైన పలు కేసుల కు సంబంధించి వాస్తవ నివేదికలను తమకు వెంటనే అందజేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సెక్టోరల్ అధికారులకు మెజిస్టీరియ ల్ అధికారులు ఇచ్చే ప్రతిపాదనలను వెం టనే హోం శాఖకు పంపాలని మీనా సూచించారు.



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

ఐదుకోట్ల మంది రాజధాని అమరావతి

● 1552వ రోజుకుచేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి17: వైసీపీ ప్రభుత్వం చీకటి జీవోలు ఇచ్చి పారదర్శకంగా నిర్వహించాల్సిన పాలనకు పాతర వేసిందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. అమరావతి మాస్టర్‌ప్లాన్‌ను నాశనం చేసేందుకు ల్యాండు ఎక్విజేషన్‌ను ఉపసంహరించు కోవటానికి రహస్య గెజిట్ ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1552వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, సీఎం జగన్‌రెడ్డి ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టటానికే మూడు ముక్కలాటకు తెరతీశారన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసి రాజధాని ఎక్కడా అనే విధంగా చేసిన సీఎం జగన్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెపుతామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తామనని చెప్పిన సీఎం మాట తప్పారన్నారు. హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఇది లేకపోతే ఎన్ని రాజధానులు పెట్టినా శుద్ధ దండగ అని స్పష్టం చేశారు. సీఎం జగన్‌రెడ్డి పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్టుగా మూడు ముక్కల ఆట ఉందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

భార్యభర్తల మధ్య ఘర్షణ.. భార్య మృతి



ఎస్తేరు రాణి మృతదేహం

అమర్తలూరు, మార్చి 17: భార్యభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భార్య మృతి చెందిన ఘటన అమర్తలూరు మండలం ఎడవూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మట్టుకొయ్య యోబు భార్య ఎస్తేరు రాణిల మధ్య శనివారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. యోబు భార్య రాణి (35)పై చేయి చేసుకోగా బలమైన దెబ్బ తగిలి ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆదివారం ఉదయం ఈ సమాచారాన్ని స్థానికులు అమర్తలూరు పోలీసులకు తెలిపారు. ఎస్ఐ నవీన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంగా తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మోహనరెడ్డి మృతదేహం

బాపట్లరూరల్, మార్చి 17: అనుమానస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం బాపట్ల పట్టణం దరివాదకొత్తపాలెంలో చోటు చేసుకుంది. బాపట్ల పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దుడ్ల మోహనరెడ్డి (18) అనే యువకుడు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. శనివారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఒక్కడే తలుపు వేసుకొని పడుకున్నాడని తెల్లవారేసరికి రూమ్‌లో చనిపోయి ఉన్నాడని తండ్రి దుడ్ల వెంకటేశ్వర్లు రెడ్డి తెలిపారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

ప్రతిధ్వనించిన ప్రజాగళం..

● రాక్షస పాలనపై పెల్లుబుకిన ఆగ్రహం
● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
● సమరోత్సాహం నింపిన నేతల ప్రసంగాలు

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ - జనసేన- బీజేపీ కూటమి ఏర్పడిన అనంతరం తొలిగా జరిగిన బొప్పూడి సభలో ప్రజాగళం ప్రతిధ్వనించింది. లక్షలాదిమంది ప్రజలు ఒక్కచోటికి చేరడం.. వైసీపీ ప్రభుత్వంపై నేతల విమర్శనాస్త్రాలు సంధించినప్పుడల్లా కేరింతలతో హోరెత్తించారు. రాష్ట్రంలో నెలకొన్న రాక్షస పాలనలో పెల్లుబుకుతున్న ఆగ్రహం సభా వేదిక వద్ద ప్రజల నినాదాలతో బలంగా వ్యక్తమైంది. సభకు వచ్చిన ప్రజలకు విసుగు రాకుండా కళాకారులు రకరకాల కళారూపాలు ప్రదర్శించారు. డప్పుల నృత్యం, కోలాటం, బాంగ్రా, కిందిరి, రేల తదితర సంప్రదాయ, గిరిజన కళారూపాలను 3 గంటలపాటు ప్రదర్శించారు. సభకు హాజరైన ప్రజల్లో చైతన్యం నింపుతూ ప్రధాని నరేంద్ర మోదీ, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రసంగించారు. మే 13 న జరగబోయే ఎన్నికలకు సమరోత్సాహాన్ని వారిలో నింపారు. ఐదేళ్ల వైసీపీ అవినీతి, అరాచక పాలనని అంతమొందించడమే లక్ష్యంగా ప్రజలు ఓటు ద్వారా తమ తీర్పుని ఇవ్వాలని పిలుపునిచ్చారు. ముఖ్యనేతలంతా ప్రాంగణం వద్దకు చేరుకోవడంతో మధ్యాహ్నం 4 గంటల నుంచే సందడి వాతావరణం నెలకొంది. సభలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, అచ్చెన్నాయుడు, ప్రత్తిపాటి పుల్లారావు, సత్యకుమార్, నక్కా ఆనందబాబు, సీఎం రమేశ్, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, గాదె వెంకటేశ్వరరావు, బొమ్మిడి నాయకర్, నిమ్మల రామానాయుడు తదితరులు ప్రసంగించారు. మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, బీజేపీ సీనియర్ నేత జీవీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పొలం గట్లమీదుగా సభకు తరలివస్తున్న అభిమానులు



సభా ప్రాంగణంలో కూర్చున్న ధూళిపాళ్ల, అనిత తదితరులు



ప్రధాని మోదీకి అభివాదం చేస్తున్న యరపతినేని



ప్రజాగళం హైలైట్స్..

ప్రజాగళం సభకు జనం ఉప్పెనలా తరలివచ్చారు. సభలో ఆసక్తికర అంశాలు..

● ఎన్‌డీఏ భారీ బహిరంగ సభ ఎన్నికల ప్రచారంలో తొలి అడుగును అదిరిపోయేలా వేసి అధికార వైసీపీ గుండెల్లో రైళ్లు పరుగెత్తించేలా చేసింది.

● అమరావతి రైతులు, మహిళల కోసం ప్రత్యేక గ్యాలరీ కేటాయించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వారు జయహో అమరావతి.. అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.

● పవన్ కల్యాణ్ ప్రసంగిస్తున్న సమయంలో అభిమానులు బారికేడ్లు, లైటింగ్ టవర్లపైకి ఎక్కారు. వారిని చూసిన ప్రధాని మోదీ పవన్‌కల్యాణ్ ప్రసంగాన్ని ఆపించి దయచేసి కింద దిగాలంటూ యువకులకు సూచించారు. విద్యుత్ వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది.. అర్థం చేసుకోవాలని తెలిపారు. ప్రధాని మాటలు అర్థం చేసుకోవాలని పవన్ కూడా చెప్పడంతో అభిమానులు కిందకు దిగారు.

● సభా ప్రాంగణానికి చుట్టూ కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో జాతీయ రహదారి నుంచి సభా ప్రాంగణానికి వేలమంది చేరుకోలేకపోయారు.

● గ్యాలరీలలో పరిమితికి మించి జనాన్ని పోలీసులు పంపడంతో అవి కిటకిటలాడాయి. వీఐపీ, వీవీఐపీ గ్యాలరీల్లోకి కూడా సామాన్య ప్రజానికం చొచ్చుకువచ్చింది. దీంతో గ్యాలరీలలో తోపులాట నెలకొంది. జనం తోసుకు రావడంతో బారికేడ్లు, కుర్చీలు విరిగిపోయాయి. గ్యాలరీలు చెదిరిపోయాయి.

● పార్కింగ్ ప్రదేశాల వద్ద పోలీసులు సరైన జాగ్రత్తలు తీసుకోలేదు. వీఐపీ పాసులు ఉన్న వాహనాలు కూడా ముందుకు పోలేని పరిస్థితి నెలకొంది. పోలీసుల అతిఆంక్షల కారణంగా చాలామంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● జనం గ్యాలరీలను దాటుకుంటూ వేదిక ముందర ఉన్న సౌండ్ సిస్టం పరికరాల మీదకు చొచ్చుకువచ్చారు. దీంతో సౌండ్ సిస్టమ్ పనిచేయక పవన్‌కల్యాణ్, చంద్రబాబు, మోదీ ప్రసంగాలకు అంతరాయం కలిగింది.

● కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ జెండాలు చేతబూని ఉరిమే ఉత్సాహంతో సభకు కదంతొక్కారు.

● చిలకలూరిపేట, మార్టూరు వైపు జాతీయ రహదారికి ఇరువైపులా అధినేతలకు స్వాగతం పలుకుతూ పెద్దఎత్తున ఫ్లెక్సీలు, కూటమి జెండాలను ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల భారీ కట్‌అవుట్లు జనాన్ని ఆకట్టుకున్నాయి.

● సభా ప్రాంగణంలో ఎయిర్ బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధినేతల ఫొటోలు ముద్రించిన టీ షర్టులు ధరించి వేలాది మంది సభకు తరలివచ్చారు.

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఒకే కారులో సభ వేదిక వద్దకు చేరుకున్నారు అభిమానులకు సెల్ఫీలు ఇస్తూ ఇరువురు సందడి చేశారు.

● చంద్రబాబు కాసేపు హిందీలో మాట్లాడారు.

● మోదీ సంకల్పించిన వికసిత భారత్‌ను సాధించేందుకు ఇదే సరైన సమయం. దేశానికి సమర్థుడైన నాయకుడు లభించారు అంటూ చంద్రబాబు మోదీపై ప్రశంసలు కురిపించారు.

● ప్రధాని నరేంద్ర మోదీ కోటప్పకొండను, పల్నాడులో అమలు చేసిన అభివృద్ధి పనులను ప్రస్తావించారు. కోటప్పకొండ దగ్గర బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల ఆశీర్వాదం లభించినట్లు భావిస్తున్నాని మోదీ చెప్పారు.

● ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తీరుపై వేదిక పై నుంచే మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వెలిబుచ్చారు. పోలీసులు బాధ్యతలు వదిలేశారంటూ మండిపడ్డారు. ప్రజలతో పాటు టీడీపీ నాయకులను కూడా అడ్డుకోవటం దారుణమని విమర్శించారు.

● బొప్పూడి సభకు వెళ్లే మార్గాల్లో ఇతర వాహనాలు దారి మళ్లించడంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. అన్ని వాహనాలు జాతీయ రహదారి పైకి రావడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

● శాండ్, ల్యాండ్, వైన్, మైన్స్, అన్ని రంగాల్లో సీఎం జగన్ దోపిడీ చేశారని చంద్రబాబు చేసిన విమర్శలకు సభికుల నుంచి విశేష స్పందన లభించింది.

● సభికులు ఎండబారిన పడకుండా వలంటీర్లు నిరంతరం మంచినీళ్ళ, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేశారు.

● జనసేనాని పవన్ కల్యాణ్, సినీనటుడు నాగబాబు మధ్యాహ్నం రెండున్నర గంటలకు, టీడీపీ యువనేత లోకేశ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మూడున్నర గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

● మండుటెండలో నాలుగైదు గంటలపాటు ప్రజలు నేతల కోసం ఆనందంగా ఎదురు చూశారు. ఫ్లెక్సీలు, నేతల కటౌట్ల నీడలో వృద్ధులు, మహిళలు తలదాచుకుంటూ సాయంత్రం వరకూ ఓపిగ్గా నిరీక్షించి నేతల ప్రసంగాలు ఆలకించారు.

● సైకో జగన్‌ను తరిమికొట్టేందుకు సిద్ధమా అని అధినేతలు ప్రశ్నించగా లక్షలాది మంది సిద్ధమంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు.

● ఎమ్మీ రఘురామరాజు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, చిట్టిబాబు తదితర టీడీపీ, బీజేపీ నేతలు మీడియా గ్యాలరీల్లో కూర్చోవాల్సి వచ్చింది.

● టీడీపీ, జనసేన యువ కార్యకర్తలు కొంతమంది ఫ్లడ్‌లైట్ టవర్లు ఎక్కి నినాదాలు చేశారు. ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కళ్లలో పడాలని విశ్వ ప్రయత్నం చేశారు. వారి పరిస్థితి చూసి స్వయంగా ప్రధాని వేదికపై నుంచి వారిని వారించి టవర్ల మీద నుంచి దించారు.

● ఒక్కొక్కరుగా నేతలు సభా ప్రాంగణానికి హెలికాప్టర్లలో చేరుకోగా వారు హెలిప్యాడ్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి జేజేలు పలుకుతూ తమ హర్షధ్వానాలను తెలియజేశారు. చంద్రబాబు, చివరగా ప్రధాని మోదీ చేరుకున్నారు. వారిని భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లపై చూస్తూ దిక్కులు పిక్కటిల్లేలా జయజయనాదాలు చేశారు.

● ప్రధాని నరేంద్ర మోదీ హిందీలో ఉపన్యసించగా దానిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలుగులోకి అనువదించారు. దాంతో మోదీ భావజాలం సభకు హాజరైన ప్రజానీకానికి స్పష్టంగా అర్థమైంది. ఈ రాష్ట్రం అభివృద్ధికి ఎన్‌డీఏ కూటమి గెలుపు ఎంత అవసరమో మోదీ నొక్కి ఒక్కాణించగా వాటన్నింటిని ప్రజలకు అర్థమయ్యేలా పురందేశ్వరి వివరించారు.

రెడ్డిగూడెంలో చీరల పంపిణీ



రెడ్డిగూడెం గ్రామంలోని మహిళలకు పంపిణీ చేస్తున్న చీరలను స్వాధీనం చేసుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి అరుణ, వీఆర్వో దుర్గాబాయి

రాజుపాలెం, మార్చి17: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ మండలంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఘటనలు ఎక్కువైపోతున్నాయి. ఈ క్రమంలోనే మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం వైసీపీ వారు వారి వలంటీర్ల ద్వారా మహిళలను ఆకర్షించే ప్రయత్నం చేశారు. 17న చిలకలూరిపేట సమిపంలోని బొప్పూడి వద్ద జరిగే ప్రజాగళం సభకు రెడ్డిగూడెం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు మొత్తం వెళ్తారని భావించిన అక్కడి వైసీపీ వారు తమ వలంటీర్ల ద్వారా మహిళలకు చీరలను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చీరలు పంపిణీ చేస్తున్నారని మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీనారాయణకు సమాచారం రావటంతో వెంటనే రెడ్డిగూడెం వెళ్లి విచారించాలని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారిణి అరుణకు సూచించారు. అరుణ రెడ్డిగూడెం వెళ్లి చూడగా చీరలు పంపిణీ చేసే వద్ద ఎవరూ లేకపోవటంతో కొద్దిసేపు విచారించారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన సయ్యాద్ దిల్షాద్ అనే మహిళ ముందుకు వచ్చి నేనే చీరలు పంపిణీ చేస్తున్నానని, ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో చీరలు పంపిణీ చేస్తానని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా చీరలు పంపిణీ చేయటం తగదని చెప్పి అక్కడ ఉన్న చీరలను స్వాధీనం చేసుకున్నారు. ఆమె వెంట వీఆర్వో దుర్గాబాయి ఉన్నారు.

వైసీపీ ప్రచారకర్తలుగా వలంటీర్లు

● ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ ● ప్రశ్నించిన పాత్రికేయునిపై దౌర్జన్యం



వలంటీర్లతో ప్రచారం చేయిస్తున్న చిన్నా

గురజాలటౌన్, మార్చి 16: వలంటీర్లు పార్టీ ప్రచారాలు చేయకూడదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అమలు కావడం లేదు. వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు దగ్గరుండి మరీ వలంటీర్లను గడపగడపకూ తిప్పుతున్నారు. పట్టణంలోని 17వ వార్డులో శని, ఆదివారం రాత్రి ఇటువంటి ఘటన జరిగింది. ఆ వార్డు కౌన్సిలర్ గంధం పద్మ భర్త చిన్నా వలంటీర్లతో ప్రచారం చేయిస్తున్నారు. ఇది తెలుసుకున్న ఆంధ్రజ్యోతి పాత్రికేయుడు అక్కడకు వెళ్లారు. అతన్ని చూడగానే చిన్నా ఆగ్రహంతో ఊగిపోయారు. సదరు పాత్రికేయుడు ఫొటో తీసే ప్రయత్నం చేయగా దుర్భాషలకు దిగాడు. ఫొటోలు తీస్తావా.. పేపరులో రాస్తావా.. చేతనైంది చేసుకోపో అంటూ ఆగ్రహించారు. కాగా వలంటీర్ల ప్రచారంపై ఆర్డీవో రమణకాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైసీపీ రంగులు తొలగిస్తారా?



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఓ భవనానికి వేసిన వైసీపీ రంగులు, కొల్లూరులో వైసీపీ రంగులతో రైతు భరోసా కేంద్రం

కొల్లూరు, మార్చి17: అధికారులు అత్యుత్సాహంతో ప్రభుత్వ కార్యాలయాలకు వేయించిన రంగులు తొలగిస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కొల్లూరులో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఓ భవనానికి వైసీపీ రంగులను వేశారు. అలాగే మండలంలో ఉన్న 15 రైతు భరోసా కేంద్రాలకు వైసీపీ రంగులు అద్దారు. అయితే వీటిలో ఎక్కువ శాతం అద్దె భవనాలు కాగా, ఒకటో రెండో మాత్రమే ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు సైతం వ్యవసాయాధికారులు వైసీపీ రంగులు వేశారు. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు రాజకీయ పార్టీల రంగులు తొలగించాల్సి ఉంది. అయితే మండల పరిషత్ కార్యాలయ భవనానికి మాత్రం మూడు రంగుల్లో ఓ రంగును తీసివేసే ఆలోచనలో ఆ శాఖాధికారులు ఉన్నారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న ఆర్‌బీకేలకు వేసిన రంగులను తొలగిస్తారా లేదా అనే సందిగ్ధ పరిస్థితి నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

రాజుపాలెం, మార్చి17: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన గుంటూరు-మాచర్ల రహదారిపై మండలంలోని రెడ్డిగూడెం గ్రామ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గుంటూరు పట్టణానికి చెందిన తోకల కోటమ్మ(58)తన బంధువులైన పాలపర్తి తిరుపతిరావు, ఉయ్యల నరసింహారావు, పాలపర్తి కిరణ్మయిలతో కలిసి దుర్గి మండలంలోని అడిగొప్పల గ్రామానికి ఆదివారం తెల్లవారుజామున ఆటోలో వెళ్తున్నారు. మార్గమధ్యలోని రెడ్డిగూడెం గ్రామ సమీపంలోకి వచ్చేసరికే పిడుగురాళ్ల నుంచి కోళ్ల లోడుతో గుంటూరుకు వెళ్తున్న లారీ అతివేగంతో వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో కోటమ్మ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. బంధువుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జె.కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

నకరికల్లు మార్చి 17: చల్లగుండ్ల హైవే పక్కన గల హోటల్‌లో ఈనెల 13వ తేదీన పెరవలి మణికంఠను హత్య చేసిన కేసులో నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు మీడియాకు తెలిపారు. ఈ హత్యకు ఘటనకు సంబంధించిన వివరాలివి.. మణికంఠ సుమారు సంవత్సరంన్నర క్రితం రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామంలో వృద్ధురాలిపై అత్యాచారం చేసి హత్య చేశాడు. ఈ కేసులో అరెస్టు అయి జైలుకు వెళ్ళి బెయిల్‌పై బయటకు వచ్చాడు. గ్రామానికి రాకుండా వేరే చోట నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో వృద్ధురాలికి సంబంధించిన వారు అతన్ని చంపి ప్రతీకారం తీర్చుకోవాలని అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీన మణికంఠ విప్పర్ల గ్రామానికి వచ్చి అతని అమ్మ, నాన్నలతో మాట్లాడి వెళ్తుండగా వృద్ధురాలి కుమారుడు అతన్ని చూసి తన మోటారు సైకిల్‌పై అతన్ని అనుసరించాడు. చల్లగుండ్ల గ్రామం వద్ద హైవే పక్కన గల హోటల్‌లో ఉండటం గమనించాడు. షేక్ మహమ్మద్ ఖాశిం అలియాస్ బాషా తిరిగి ఇంటికి వెళ్ళి మరో నలుగురితో కలసి వచ్చి మణికంఠను కత్తులు, గొడ్డళ్ళతో నరికి చంపారు. అనంతరం అక్కడినుంచి వారు పారిపోయారు. ఆదివారం అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై విప్పర్ల వద్ద ఉన్న షేక్ మహమ్మద్ ఖాశిం అలియాస్ బాషాను, షేక్ కరిముల్లా, షేక్ మదార్‌వలి, షేక్ షాజహాన్, షేక్ జానీ బాషాలను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ఎం రాంబాబు తెలిపారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య



తాతా శివయ్య ఫైల్‌ఫొటో

బాపట్లరూరల్, మార్చి 17: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందిన ఘటన బాపట్ల పట్టణం ప్యాడిసన్‌పేట జగనన్నకాలనీలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కాలనీకి చెందిన తాతా శివయ్య(35) అనే వ్యక్తి కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహిస్తూ జీవనాన్ని కొనసాగించేవాడు. అప్పులు ఎక్కువ అవ్వటంతో తట్టుకోలేక తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శివపార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించటం జరిగిందని పట్టణ పోలీసులు తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు

- యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి 17: రాష్ట్ర అభివృద్ధి, ప్రయోజనాల కోసమే అరాచక పాలనపై ఉమ్మడి పోరు కొనసాగిస్తున్నట్లు యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం బొప్పూడి వద్ద ప్రజాగళం బహిరంగసభ ప్రధానమంత్రి ఆహ్వాన కమిటీలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరితో పాటు పల్నాడు జిల్లా నుండి గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు వున్నారు. ప్రధానమంత్రి వేదిక ఆహ్వానకమిటీలో వున్న యరపతినేని ప్రధానమంత్రితో పల్నాడు జిల్లా అభివృద్ధిపై కొన్ని నిమిషాలపాటు మాట్లాడారు. ప్రధానమంత్రి మోడీకి నమస్కరించిన యరపతినేని రాష్ట్రంలో ఉమ్మడిపోరుతో అరాచక పాలన పోయి స్వేచ్ఛగా జీవించడంతోపాటు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమపథకాలు సజావుగా అందుతాయన్నారు. ప్రధానమంత్రి వేదికపై ఆహ్వాన కమిటీలో యరపతినేని శ్రీనివాసరావుతో పాటు బూరల రామాంజనేయులు, గొట్టిపాటి రవికుమార్, నూకసాని బాలాజీ, తదితర టీడీపీ, జనసేన, భాజపా నేతలు వున్నారు. దేశ ప్రధాని మోడీని స్వయంగా ఆహ్వానించే కమిటీలో చోటుదక్కడంతో పాటు మోడీతో కొద్దినిమిషాలు మాట్లాడేందుకు అవకాశం రావడంతో పల్నాడు అభివృద్ధిపై చర్చించినట్లు యరపతినేని తెలిపారు.

జూలై నెలలో రాష్ట్రస్థాయి అర్చక పరీక్షలు

● ఈ నెల 30 నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లి, మార్చి 17: రాష్ట్రస్థాయి అర్చక (ఆగమ) పరీక్షల నిర్వహణకు వచ్చే జూలై 1,3 14 తేదీలు ఖరారు చేసినట్లు అర్చక ట్రైనింగ్ అకాడమి శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు సాధారణ రుసుముతో అనంతరం మే నెల 10 లోపు అపరాధ రుసుముతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపింది. కాగా ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో ఏ విధంగా దరఖస్తు చేసుకోవాలో విధి విధానాలు తెలియజేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే అర్చక ట్రైనింగ్ అకాడమి యూ ట్యూబ్ ఛానల్ ద్వారా అర్చక పరీక్షల సంస్కృత పాఠ్యాంశాలు బోధించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సులో శిక్షణ

తాడేపల్లి, మార్చి 17: మానస సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సు (శాప్ ఎస్‌డీ)లో మార్చి 23 నుంచి ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వ్యవస్థాపకులు వంగర సురేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోర్సు కాలపరిమితి మూడు నెలలని తెలిపారు. వివరాలకు 9985222857, 903059539 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

ఎయిర్‌క్రాఫ్ట్స్ ల్యాండింగ్ ట్రయిల్‌రన్‌కు పటిష్ట బందోబస్తు

● ఎస్పీ వకుల్ జిందాల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మార్చి 17 : అత్యవసర పరిస్థితులలో విమానాలు కిందకు దిగటానికి 16 నెంబరు జాతీయ రహదారి కొరిశపాడు మండలం పిచికలగుడిపాడు వద్ద సోమవారం నిర్వహించే ఎమర్జెన్సీ ల్యాండింగ్ ట్రయిల్‌రన్‌కు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో విమానాలు కిందకు దిగటానికి 16 నెంబరు జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటిలో 18వ తేదీన ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయిల్‌రన్ జరగనున్న నేపథ్యంలో సుమారు 528మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అందువల్ల జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను ఉదయం 7.30 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దారి మళ్ళించటం జరుగుతుందన్నారు. గుంటూరు వైపు నుంచి ఒంగోలు, నెల్లూరు, చెన్నై వైపు వెళ్ళు వాహనాలను రేణంగివరం జంక్షన్ నుంచి అద్దంకి పట్టణంలోని నామ్‌హైవే మీదగా మేదరమెట్ల వద్ద 16 నెంబరు జాతీయ రహదారిలో కలిసే విధంగా దారిమళ్ళించటం జరిగిందన్నారు. ఒంగోలు వైపు నుంచి చిలుకలూరిపేట, గుంటూరు, విశాఖపట్టణం వైపు వెళ్ళు వాహనాలను మేదరమెట్ల వద్ద ఉన్న హోల్డింగ్ పాయింట్‌లో నిలుపుదల చేయటం జరుగుతుందన్నారు. గుంటూరు వైపు నుంచి ఒంగోలు, చెన్నై వైపు వెళ్ళు భారీ వాహనాలను 16వ నెంబరు జాతీయ రహదారిపై మార్టూరు వద్ద ఉన్న హోల్డింగ్ పాయింట్‌లో నిలుపుదల చేయటం జరుగుతుందని, వాహనదారులు ఈ విషయం గమనించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ సూచించారు.

పంచాయతీలలో తొలగించని పార్టీ పోస్టర్‌లు


బాపట్ల మండలంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ఇంకా తొలగించని పార్టీ పోస్టర్‌లు

బాపట్ల రూరల్, మార్చి 17 : ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కోడ్ అమలు పరిచిన 24 గంటలలోగా ప్రభుత్వ కార్యాలయాలలో, బహిరంగ స్థలాలలో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్స్, పోస్టర్‌లను అధికారులు తొలిగించాల్సి ఉండగా బాపట్ల మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో ఉన్న పార్టీ పోస్టర్‌లను, ఫ్లెక్సీలను అధికారులు తొలగించలేదు.

భట్టిప్రోలు గ్రామంలో...


భట్టిప్రోలు గ్రామంలో స్తంభానికి ఉన్న వైసీపీ బ్యానర్లు

భట్టిప్రోలు, మార్చి 17 : ఎన్నికల కోడ్ నిబంధనలు పలు గ్రామాల్లో అమలు కావడం లేదు. రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్‌లు తొలగించడంలో పంచాయితీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. భట్టిప్రోలు గ్రామంలో పలు చోట్ల స్తంభాలకు కట్టిన వైసీపీ బ్యానర్‌లు అలానే ఉన్నాయి. గ్రామంలో అక్కడక్కడ వైసీపీ బ్యానర్‌లు దర్శనమిస్తున్నాయి. అదనపు సిబ్బందిని వినియోగించుకుని ఎన్నికల నియమ నిబంధనలను అమలు చేయాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదు. వైసీపీ పార్టీ ఏర్పాటు చేసిన బ్యానర్‌లు ఎందుకు తొలగించలేదని ప్రజలు పంచాయితీ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్పందన కార్యక్రమం రద్దు : కలెక్టర్

బాపట్లమార్చి 17 : ఎన్నికలకోడ్ అమలలోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేయటం జరిగిందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ శనివారం విడుదల చేసిందని దీంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలలోకి వచ్చినందున స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆయన చెప్పారు. ప్రజలు స్పందనలో అర్జీలివ్వటానికి రావద్దని కలెక్టర్ తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందన తాత్కాలికంగా రద్దు

బాపట్ల,మార్చి 17 : బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పిచికలగుడిపాడు గ్రామ పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయిల్ రన్‌ను సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో ఎస్పీ కార్యాలయంలో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్టు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు కార్యాలయానికి వచ్చే అర్జీదారులు సదరు విషయాన్ని గమనించాలని ఎస్పీ చెప్పారు.

గేట్ పరీక్షలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ప్రతిభ

బాపట్లరూరల్, మార్చి 17 : జాతీయ స్థాయి గేట్-2024 పరీక్షలలో జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్‌ను బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి జి.రవి తేజ సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల గేట్ పోటీ పరీక్షలలో జాతీయ స్థాయిలో ఇంతకుముందు కూడా తమ విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంక్ తెచ్చుకున్నారని 1997లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ వచ్చిందని, ఆ తర్వాత సంవత్సరాలలో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు మంచి ర్యాంక్ సాధించారన్నారు. ఈ సంవత్సరం జాతీయ స్థాయిలో రెండోవ ర్యాంక్ సాధించటం ఆనందంగా ఉందని తెలిపారు. ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీకి గేట్ ర్యాంక్‌ను సాధించటంలో ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ సంవత్సరం తమ విద్యార్థి జి.రవితేజ జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్‌ను కైవశం చేసుకొని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రతిభను జాతీయ స్థాయిలో తీసుకెళ్ళటం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నజీర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


బాపట్ల మండల గ్రామాలలో కవాతు నిర్వహిస్తున్న బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి, పోలీసులు

పిన్నిబోయనవారిపాలెం గ్రామంలో పోలీసు కవాతు

బాపట్ల రూరల్, మార్చి 17 : బాపట్ల మండలం తూర్పు, పడమర పిన్నిబోయనవారిపాలెంలలో ఆదివారం రూరల్ పోలీసులు కవాతు నిర్వహించారు. రూరల్ సీఐ శ్రీహరి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు బీఎస్ఎఫ్ పోలీసులతో కవాతు నిర్వహించటం జరిగిందని తెలిపారు.

ప్రజాగళం సభకు భారీగా తరలివెళ్ళిన శ్రేణులు


బాపట్ల పట్టణం, మండలం నుంచి ప్రజాగళం సభకు బయలుదేరి వెళ్ళిన ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

బాపట్ల, మార్చి 17 : చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడి గ్రామం వద్ద ఆదివారం నిర్వహిస్తున్న ప్రజాగళం సభకు బాపట్ల మండలం, పట్టణాలు నుండి అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్ళారు.

● కర్లపాలెం, మార్చి 17 : చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ప్రజాగళం సభకు కర్లపాలెం మండలం నుంచి వేలాది మంది తెలుగుదేశం పార్టీ, జనసేన సైనికులు, బీజేపీ నాయకులు ఆర్టీసీ, పలు పాఠశాలల ప్రైవేట్ బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు తదితర వాహనాలలో వేలాది మంది తరలివెళ్ళారు. కర్లపాలెంలో టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన జెండాలను ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీటీసీ షేక్ బాజి, నక్కల వెంకటస్వామి, పిట్ల వసంతరెడ్డి, గఫూర్, సమ్మెట నాగేంద్రరెడ్డి, చిన్న తదితరులు ఉన్నారు.


కర్లపాలెం నుంచి ప్రజాగళం సభకు బయలుదేరుతున్న టీడీపీ, జనసేన నాయకులు

● పిట్టలవానిపాలెం, మార్చి 17 : చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి గ్రామంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభకు బాపట్ల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పిలుపు మేరకు పిట్టలవానిపాలెం మండలం నుంచి అధిక సంఖ్యలో త్రిముఖ పార్టీల నాయకులు తరలివెళ్ళారు. ప్రజాగళంకు తరలివెళ్ళిన వారిలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎండి అఫ్జల్, టీడీపీ బాపట్లపార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్‌ఖాసీం, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కనుమూరి సాంబమూర్తిరాజు, మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సోపాటి, మోదుగుల శంకరరెడ్డి, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు దాదా, బాపట్ల నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కలకోట కిషోర్‌రెడ్డి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గోకరాజు శ్రీధర్‌వర్మ, త్రిముఖ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్ళారు.


పిట్టలవానిపాలెం నుంచి ప్రజాగళంకు తరలివెళ్ళిన త్రిముఖ పార్టీల నాయకులు

● వేమూరు, మార్చి 17 : చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రజాగళం మహాసభకు మండల పరిధి గ్రామాల నుంచి టీడీపీ, జనసేన శ్రేణులు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్ళారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి సుధాకర్, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు అమ్మిశెట్టి కిషోర్, బీసీ సంఘం నాయకులు శివకృష్ణ, జనసేన పార్టీ సమన్వయకర్త ఉసా రాజేష్, జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ, రెండు పార్టీల శ్రేణులను పెద్ద సంఖ్యలో సమీకరించారు. బస్సులు, టాక్సీలు, సుమోటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా ప్రతి గ్రామం నుంచి పార్టీ జెండాలతో నినాదాలు చేసుకుంటూ శ్రేణులు ఉత్సాహంగా సభకు తరలి వెళ్ళారు. ప్రతి గ్రామంలో సభకు వెళ్ళే వారికి మజ్జిగ, భోజనం ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.


వేమూరు నుంచి ప్రజాగళం మహాసభకు తరలివెళుతున్న టీడీపీ శ్రేణులు

● భట్టిప్రోలు, మార్చి 17 : చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి గ్రామంలో ఆదివారం జరుగుతున్న ప్రజాగళం చారిత్రాత్మక భారీ బహిరంగ సభకు మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్ళారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు బస్సులలో తరలివెళ్ళారు. భట్టిప్రోలు గ్రామం నుంచి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, నాయకులు బట్టు మల్లికార్జునరావు, కనపర్తి సుందరరావు, యడ్ల జయశీలరావు, ఇర్ఫాన్‌బేగ్, జంగం శ్యాంసన్, ఇబ్రహీంబేగ్ తదితరుల పర్యవేక్షణలో కార్యకర్తలు బయలుదేరి వెళ్ళారు. అదేవిధంగా మండల కన్వీనర్ వాకా శేషుబాబు ఆధ్వర్యంలో సూరేపల్లి, కోనేటిపురం, పల్లెకోన, రాచూరు, ఆళ్ళమూడి గ్రామ పంచాయతీల నుంచి భారీగా కార్యకర్తలు, నాయకులు సభకు తరలివెళ్లారు.


భట్టిప్రోలు నుంచి ప్రజాగళం సభకు భారీగా తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులు

● కొల్లూరు, మార్చి 17 : ప్రజాగళం బహిరంగ సభకు టీడీపీ, జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. టీడీపీ నాయకులు షైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి 17 బస్సులు, 40 కార్లలో బహిరంగ సభకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. తొలుత కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ వద్ద మురళీకృష్ణ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యలవర్తి కోటేశ్వరరావు, సుంకర రాంబాబు, కోగంటి శివవెంకటేశ్వరరావు, శిగిలిశెట్టి రాఘవరావు, టీడీపీ, జనసేన కార్యకర్తలు తరలి వెళ్లారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా తలపెట్టిన బహిరంగ సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరు కానుండటంతో వేమూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గళ్లా వెంకట కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు స్వచ్ఛందంగా తమ వాహనాలలో బహిరంగ సభకు తరలి వెళ్లారు.


కొల్లూరు నుంచి ప్రజాగళం బహిరంగ సభకు తరలివెళుతున్న టీడీపీ, జనసేన శ్రేణులు

● రేపల్లె, మార్చి 17 : ఉమ్మడి కూటమితో చిలకలూరిపేటలో పెట్టిన ప్రజాగళం సభకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా సభకు తరలి వెళ్ళారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సారథ్యంలో 105 బస్సులు, 50 కార్లుతో తీరప్రాంతం నుంచి సభకు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రానున్నది టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వమేనన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన అంతిమ విజయం మాదేనన్నారు. రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని సూచించారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ, జనసేనతోనే సాధ్యమన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ళ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించి యువతను ఉద్యోగ అవకాశాలు లేకుండా పక్క రాష్ట్రాలకు తరలి వెళ్ళే విధంగా చేశారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.


చెరుకుపల్లి నుంచి ప్రజాగళం సభకు బయల్దేరిన టీడీపీ నాయకులు

గ్రామాల్లో పార్టీల ఫ్లెక్సీలు, జెండాలు తొలగింపు


పోతుమర్రులో ఫ్లెక్సీలు తొలగింపజేస్తున్న రెవెన్యూ అధికారి

వేమూరు, మార్చి 17 : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిధి గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను ఆదివారం పూర్తిగా తొలగించారు. 17 గ్రామాల పరిధిలో ఎంపీడీవో శేషగిరిరావు పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు తమ సిబ్బంది ద్వారా పోస్టర్లు, బ్యానర్లు, తోరణాలు, కరెంట్ పోల్స్ టెలిఫోన్ స్తంభాలపై కట్టిన జెండాలు, శిలాఫలకాలు తొలగించడంతో పాటు రాజకీయ నాయకులకు చెందిన 22 విగ్రహాలకు ముసుగులు వేయించారు. సొంత భవనాలు, సొంత స్థలాలలో పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు కానీ, తోరణాలు కానీ ఏర్పాటు చేసుకోదలచిన వారు ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని ఎంపీడీవో గ్రామాల్లో ప్రచారం చేయించారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి అనుమతి ఇవ్వడంతో పాటు సంబంధించిన పార్టీకి చెందిన అభ్యర్థి నుంచి రుసుం వసూలు చేస్తారని కూడా ఆయన వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి గురించి మైకుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు.


భట్టిప్రోలులో బ్యానర్‌లు, ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

భట్టిప్రోలు మండలంలో...

భట్టిప్రోలు, మార్చి 17 : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లను ఆదివారం ఆయా గ్రామాల సిబ్బంది తొలగిస్తున్నారు. రాజకీయ పార్టీలకు చెందిన నేతల విగ్రహాలకు ముసుగులు వేయిస్తున్నారు. గ్రామ ప్రధాన కూడళ్ళల్లో ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించి పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్లలో కార్యాలయాలకు తరలిస్తున్నారు. కొన్ని చోట్ల ఉన్న భారీ ఫ్లెక్సీలను తొలగించాలని సదరు రాజకీయ పార్టీల నేతలకు సమాచారం చేరవేశారు. ఎన్నికల కోడ్ అమలుతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది.

కొల్లూరు మండలంలో...

కొల్లూరు, మార్చి 17 : రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లను పంచాయతీ సిబ్బంది తొలగింపజేశారు. కొల్లూరుతో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లను పంచాయతీ కార్యదర్శి బి.మల్లికార్జున ఆధ్వర్యంలో ఆదివారం తొలగించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల లోపు రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, తదితర వాటిని తొలగించాలని ఆదేశాలు ఉండటంతో ఆ లోపే వాటిని తొలగించారు. కొందరు శనివారం రాత్రి స్వచ్ఛందంగానే తమ బ్యానర్లకు తొలగించుకుని ఫ్రేమ్‌లను భద్రపరుచుకున్నారు.


కొల్లూరులో ఫ్లెక్సీలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది


రాజశేఖర్‌కు పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానం పలుకుతున్న ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

వైసీపీ నాయకుడు రాజశేఖర్ టీడీపీలో చేరిక

బాపట్ల, మార్చి 17 : బాపట్ల పట్టణ ప్రముఖ వైసీపీ నాయకుడు ముప్పిరి రాజశేఖర్ బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఆదివారం బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ చేతులమీదుగా తెలుగుదేశం కండువాకప్పుకొని పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో చీడపురుగు ముద్రగడ

● కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి

భట్టిప్రోలు, మార్చి 17 : రాష్ట్ర రాజకీయాల్లో ముద్రగడ చీడపురుగని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాపు ద్రోహి ముద్రగడ పద్మనాభంకు బహిరంగ లేఖ రాసినట్లు శ్రీనివాసరావు చెప్పారు. 2004 నుండి నిద్రలో ఉన్న ముద్రగడ డ్రామా దీక్షకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ మద్దతునివ్వలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. దేశంలో ఎన్టీఆర్, జయలలిత, ఎంజీఆర్, చిరంజీవి, పవన్‌కల్యాణ్‌లు రాజకీయ రంగంలో కీలకపాత్ర పోషించారన్న విషయం ముద్రగడకు తెలియకపోవడం ఆయన అజ్ఞానానికి నిదర్శనంగా అభివర్ణించారు. రాజకీయ రంగంలో పవన్‌కల్యాణ్ నిజమైన హీరో అని, బానిస నుంచి కట్టుబానిసగా మారిన ముద్రగడ హీరోగా పోల్చుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేడు జగన్ డైరెక్షన్‌లో వైసీపీలోకి వెళ్ళి వైఎస్ఆర్ గొప్పవాడని చెప్పడం ద్వారా ముద్రగడ ముసుగుదొంగ అని రుజువైందని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

టెన్త్ పరీక్షలకు రంగం సిద్ధం

● హాజరు కానున్న 307 మంది విద్యార్థులు

వేమూరు, మార్చి 17 : మండల పరిధిలోని సోమవారం ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు రంగం సిద్ధం చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్న 307 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 82 మంది, జంపని పాఠశాల నుంచి 95 మంది, వరహాపురం నుంచి 14 మంది, కుచ్చెళ్ళపాడు నుంచి 24 మంది, పెరవలి నుంచి 49 మంది, చావలి నుంచి 43 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలురు 156 మంది, బాలికలు 151 మంది ఉన్నారు. కాగా ఇంగ్లీష్ మీడియంలో 144 మంది, తెలుగు మీడియంలో 163 మంది పరీక్షలు రాయనున్నారు. జంపని, వేమూరు, వరహాపురం పాఠశాలలకు చెందిన 191 మంది విద్యార్థులు వేమూరు పరీక్ష కేంద్రంలో, పెరవలి, చావలి పాఠశాలలకు చెందిన 92 మంది పెరవలి పరీక్షా కేంద్రంలో, కుచ్చెళ్ళపాడుకు చెందిన 24 మంది విద్యార్థులు కొల్లూరు మండలంలోని అనంతవరం పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాస్తారని తెలిపారు. కేంద్రాలలో తాగునీరు, వైద్య సౌకర్యాలను కూడా కల్పించినట్లు తెలిపారు.

● కొల్లూరు, మార్చి 17 : పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో జ్యోతి ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొల్లూరు, బాలురోన్నత, బాలికోన్నత పాఠశాలలు పదవ తరగతి పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య సౌకర్యాలతో పాటు తాగునీరు తదితర వాటిని అందుబాటులోకి ఉంచారు. అనంతవరం పరీక్షా కేంద్రంలో చిలుమూరు శ్రీరామా రూరల్ విద్యా సంస్థల విద్యార్థులు కూడా అక్కడే పరీక్ష రాయాల్సి ఉంది. దోనేపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొల్లూరు పరీక్ష కేంద్రాలలో పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. అనంతవరంలో 116 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. అక్కడ ఏడుగురు ఇన్విజిలేటర్లు, కొల్లూరు బాలురోన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు, 11 మంది ఇన్విజిలేటర్లు, బాలికోన్నత పాఠశాలలో 204 మంది విద్యార్థులు, 11 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో పరీక్షలు రాసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో తెలిపారు.

● కర్లపాలెం, మార్చి 17 : కర్లపాలెం మండలంలో ఏడు ప్రభుత్వ, మూడు ప్రైవేట్ పాఠశాలలు నుంచి 448 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారని మండల విద్యాశాఖాధికారి ఎస్.విజయశ్రీ తెలిపారు. వీరితో పాటు ఖాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 95 మంది విద్యార్థులు, యాజలిలో 181, చింతాయపాలెంలో -175, ఎం.వి.రాజుపాలెంలో 201 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతారన్నారు. మూడు పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని అన్ని వసతులు కల్పించామని ఎంఈవో వివరించారు.

పది పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

బాపట్ల, మార్చి 17 : పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా పరీక్షలు రాసే విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలకు వెళ్ళేందుకు ఆర్టీసీ బస్సులో హాల్‌టిక్కెట్టు చూపించి ఉచితంగా ప్రయాణం చేయటానికి ఆర్టీసీ సదుపాయాన్ని కల్పించిందని, విద్యార్థులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల డిపోమేనేజర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

బాపట్ల, మార్చి 17 : బాపట్ల జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావసభ స్థానిక ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈసభకు అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా అధ్యక్షుడు కెపి రంగారావు వహించగా ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే రఘుపతి మాట్లాడుతూ కెమిస్ట్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దృష్టికి తీసుకెళ్ళి కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం నూతనంగా ఏర్పడిన జిల్లాలో అసోసియేషన్ అధ్యక్షులు చెంచయ్య, జిల్లా కార్యదర్శిగా కెవి కుమార్, కోశాధికారి సూర్యనారాయణరావులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీమాంధ్ర డ్రగ్ డీలర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డి.కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్, కోశాధికారి టివి.సుబ్రహ్మణ్యం పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి మూర్తి, ఎస్‌విఆర్ కుమార్, వివిధ ప్రాంతాలు నుంచి కెమిస్ట్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

వేమూరు, మార్చి 17 : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సంకల్పించిన అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు చవ్వాకుల కోటేష్‌బాబు తెలిపారు. మండలంలోని చావలి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జాయింట్ సెక్రటరీ డాక్టర్ గాజుల నంద కిషోర్ సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని గాజుల వీరయ్య ప్రారంభించారు. డాక్టర్ శనక్కాయల ఉదయశంకర్ ఆధ్వర్యంలో పది మంది వైద్యులు, 1200 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ సూర్య మందులను ఉచితంగా సరఫరా చేశారు. కార్యక్రమంలో గాజుల వీరయ్య, గాజుల సాయికృష్ణ, గాజుల శ్రీనివాసరావు, గాజుల చిన్నభాను, గాజుల విజయసారధి, ఎక్కటి పాములు, బుజ్జి విష్ణుములకల వాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నిదారులూ బొప్పూడివైపే..

» ప్రజాగళం సభకు పర్చూరు, అద్దంకి నుంచి భారీగా తరలివెళ్లిన ప్రజలు
» వేదిక దగ్గర కావడంతో సొంత వాహనాల్లోనే పయనం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ప్రజాగళం బహిరంగ సభకు పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల నుంచి ఎన్‌డీఏ కూటమి శ్రేణులతోపాటు సామాన్య ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చీరాల నియోజకవర్గం నుంచి భారీగానే వచ్చినప్పటికీ పర్చూరు, అద్దంకిల నుంచి సాధారణ ప్రజానీకం స్వచ్ఛందంగా తరలిరావడం కనిపించింది. టీడీపీ, జనసేనలు బీజేపీతో ఎన్నికల అవగాహనకు వచ్చి ఎన్డీయేలో చేరిన తర్వాత ఆ కూటమి మిత్రులంతా ఆదివారం ప్రజాగళం పేరుతో చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద సభను నిర్వహించారు. ప్రధాని మోదీ కూడా హాజరుకావడంతో సభకు ప్రత్యేక ఆకర్షణ వచ్చింది. సభ జరిగిన ప్రాంతం చిలకలూరిపేట నియోజకవర్గం అయినప్పటికీ అది పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలకు బాగా చేరువలో ఉంది. సభ నిర్వహణ బాధ్యతల్లోనూ ఆ రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్‌లకు ప్రాధాన్యం ఇచ్చారు. సమీప నియోజకవర్గాలు కావడంతో ఎక్కువ సంఖ్యలో జనాన్ని సమీకరించాలని టీడీపీ అధినాయకత్వం టార్గెట్ కూడా ఇచ్చింది. తదనుగుణంగా ఇటు


మార్టూరు: గన్నవరం నుంచి ప్రజాగళంకు బయలుదేరిన తెలుగు మహిళలు

సాంబశివరావు, అటు రవికుమార్ కూడా నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను భారీగా కదిలించారు. నాయకులు ఏర్పాటుచేసిన వాహనాల్లో తరలివచ్చిన వారితో పాటు రెండు నియోజకవర్గాల్లోని ప్రజలు స్వచ్ఛందంగా బొప్పూడి సభకు రావడం గమనార్హం. రెండు నియోజకవర్గాల నుంచి 70 వేల మందికిపైగా హాజరైనట్లు అంచనా. ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన వాహనాల ద్వారానే 45 వేల నుంచి 50 వేల మంది హాజరయ్యారు. అనేక గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకుని తరలివచ్చారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న ట్రాక్టర్లతోపాటు బైక్‌లు, స్వల్ప సంఖ్యలో కారుల్లో తరలిరావడం కనిపించింది. రాష్ట్రేతర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడిన వారు ముందురోజు స్వగ్రామాలకు చేరుకొని సభకు రావడం కనిపించింది. పర్చూరు నియోజకవర్గంలో సభా ప్రాంగణానికి చేరువలో ఉన్న మార్టూరు, యద్దనపూడి.. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాల నుంచి పరుగుపరుగున సభకు తరలివచ్చారంటే అతిశయోక్తికాదు. అద్దంకి నియోజకవర్గంలో కొత్తగా వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య, ఆయన కుమారుడు కృష్ణచైతన్యతోపాటు వారి అనుచరులు ఆయా గ్రామాల నుంచి ఇప్పటికే టీడీపీలో ఉన్న శ్రేణులతో కలిసి సభకు వెళ్లడం విశేషం. చీరాల నియోజకవర్గం నుంచి భారీగానే తరలివచ్చారు. టీడీపీ ఇన్‌చార్జి కొండయ్య ఏర్పాటుచేసిన వాహనాలకుతోడు గ్రామాల నుంచి స్వచ్ఛందంగా బస్‌లు ఏర్పాటు చేసుకుని మరీ ప్రజలు తరలిరావడం చర్చనీయాంశమైంది.

మోటారుసైకిళ్లపై ర్యాలీగా వెళ్లిన శ్రేణులు

అద్దంకి, మార్చి 17: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో బొప్పూడి వద్ద ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభకు అద్దంకి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో వందల సంఖ్యలో ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సులతో పాటు పలు ప్రయివేట్


మార్టూరు: యద్దనపూడిలోని పార్టీ కార్యాలయం నుంచి ద్విచక్రవాహనాలపై ర్యాలీగా తరలిన కార్యకర్తలు

వాహనాలలో పెద్ద ఎత్తున ఆయా పార్టీల శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సభ అద్దంకి నియోజకర్గానికి అత్యంత సమీపంలో ఉండటంతో బల్లికురవ, సంతమాగులూరు, పంగులూరు మండలాలతోపాటు అద్దంకి పట్టణంలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ద్విచక్ర వాహనాలపై వెళ్ళారు. అద్దంకి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఉవ్వెత్తిన ఉప్పొంగిన ఉత్సాహంతో స్వచ్ఛందంగా తరలివెళ్ళారు. అన్నివర్గాల ప్రజలు ఉత్సాహంగా ప్రజాగళం సభకు తరలివెళ్ళారు.

అద్దంకి పట్టణంలోని 8వ వార్డు పరిధిలో శ్రీరామ్‌నగర్ ఎస్టీకాలనీ వాసులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజాగళం తరలివెళ్ళారు. ఆయా గ్రామాల నేతలు సైతం ప్రత్యేక దృష్టి సారించటంతో అంచనాలకు మించి అద్దంకి నియోజకవర్గం నుండి ప్రజాగళం సభకు తరలివెళ్ళారు. పశ్చిమ ప్రకాశంలోని పలు నియోజకవర్గాల నుండి పెద్ద సంఖ్యలో వాహనాలలో ప్రజాగళం సభకు రావటంతో అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పర్చూరు: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ఆదివారం బొప్పూడిలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు విశేష స్పందన లభించింది. పర్చూరు నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి పెద్దఎత్తున ఆయా పార్టీలశ్రేణులు తరలి వెళ్ళారు. యువకులు, మహిళలు, వృద్ధులు సైతం సభకు తరలి వెళ్ళటంతో కూటమిలో నూతన ఉత్సాహం నెలకొంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపు మేరకు స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి ఆయా గ్రా


మేదరమెట్ల: ప్రజాగళంకు భారీగా తరలివెళుతున్న టీడీపీ, జనసేన నేతలు

మాల నుంచి వచ్చిన వాహనాలతో ర్యాలీగా వెళ్ళారు. పర్చూరు మండలం నుండి 102 కార్లు, 14 స్కూల్ బస్సులు, 16 ట్రాక్టర్లు, 500కు పైగా బైక్‌లు, 40 ఆటోలను ఏర్పాటుచేసుకొని వెళ్ళారు. అలాగే కారంచేడు మండలం నుచి 60 కార్లు, 7 స్కూల్ బస్సులు, చినగంజాం నుంచి 24 ఆర్‌టీసీ బస్సులు, 60 కార్లు, ఇంకొల్లు నుంచి 26 స్కూల్ బస్సులు, 60 కార్లు, 20 ఆటోల్లో తరలివెళ్ళారు. అలాగే, మార్టూ మండలం నుంచి 20 బస్సులు, 200కు పైగా కార్లు, 1500 బైక్‌లు, 30 టాక్టర్లు, యద్దనపూడి నుంచి 70 కార్లు, 1100 బైక్‌లు, 35 ట్రాక్టర్లతోపాటు, ఆటోల్లో తరలి వెళ్లారు.

చినగంజాం: ప్రజాగళం సభకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మండల పరిధిలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో నాయకులు ఆసోది సుబ్బారెడ్డి, వడ్లమూడి వెంకయ్య, దండుప్రోలు తిరుపతిరావు, వాటుపల్లి ఏడుకొండలు, కోకి భాస్కరరెడ్డి, రాజు వెంకటేశ్వరరెడ్డి, రాయని ఆత్మారావు, మోటుమర్రి రామసుబ్బారావు, చేవూరి రమణమ్మ, నరహరి శ్రీనివాసరావు, టి.చిన్నా, కొక్కిలిగడ్డ విష్ణు, నాంచార్యులు, శేరు వెంకటేశ్వర్లు, నక్కల వీరరాఘవులు, చల్లా వెంకటరావు, యార్లగడ్డ లక్ష్మీ, కె.రామాంజనేయులు, కె.శ్యాంబాబు, జనసేన నాయకుల ఆధ్వర్యంలో బస్సులు, కార్లు, తదితర వాహనాల్లో భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లారు.

చీరాల: చిలకలూరిపేట సమీపంలో బొప్పుడి వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభకు చీరాల నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు శ్రేణులు తరలి వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటుచేశారు. సుమారు వంద వాహనాల్లో సభకు కూటమి శ్రేణులు తరలి వెళ్లారు. అంతకుముందు టీడీపీలో చేరిన మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు స్థానిక టీడీపీ కార్యాలయానికి వెళ్లారు. అందుబాటులో ఉన్న నాయకులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. తనకు సన్నిహితుడైన ప్రముఖ వైద్యులు డాక్టర్ పోలవరపు వెంకటేశ్వరప్రసాద్ మృతి చెందగా, ఆయన అంతిమ యాత్రలో పాల్గొననున్న నేపథ్యంలో ప్రజాగళం సభకు వెళ్లలేకపోయినట్టు డాక్టర్ పాలేటి తెలిపారు.


అద్దంకి పట్టణంలోని శ్రీరామ్‌నగర్ ఎస్టీ కాలనీ నుండి ప్రజాగళం సభకు తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులు

మార్టూరు: తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి ఆదివారం సాయంత్రం బొప్పూడి వద్ద ఏర్పాటుచేసిన ప్రజాగళం సభకు మార్టూరు మండలం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని అన్నిగ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలు గు మహిళలు వివిధ వాహనాల్లో తరలి వెళ్లారు. గ్రామాలలో యువకులు ద్విచక్రవాహనాల్లో భారీగా ర్యాలీగా సభకు వెళ్లారు. ఇసుకదర్శిలోని ఎమ్మె ల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి ఒంగోలు వైపు బొల్లాపల్లి టోల్ ప్లాజా వరకు, గుంటూరు వైపు తాతపూడి సెంటరు వరకు జాతీయ రహదారిపై టీడీపీ, జనసేనకు చెందిన జండాలను ఏర్పాటు చేశారు. మార్టూరులో టీడీపీ పార్టీ కార్యాలయం వద్ద నుంచి కార్యకర్తలు వాహనాలలో తరలివెళ్లారు. గ్రామాల నుంచివాహనాలతో పాటు దాదాపుగా ప్రతి గ్రామం నుండి వంద మందికి పైగా పార్టీ కార్యకర్తలు ద్విచక్రవాహనాలతో బయలుదేరి వెళ్లారు. యద్దనపూడి పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలు ద్విచక్రవాహనాలపై భారీగా వెళ్లారు. గన్నవరం నుంచి తెలుగు మహిళలు ఉత్సాహంగా ప్రజాగళానికి తరలివెళ్లారు.

ప్రజాగళానికి తరలివెళ్లడానికి ఆదివారం ఉదయం 11 గంటలకు ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయానికి పార్టీ నాయకులు వచ్చా రు. ఎమ్మెల్యే సాంబశివరావు వారిని ఆహ్వానించారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరి మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, చీరాల ఇన్‌చార్జ్ కొండయ్య, బనగానిపల్లె మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తదితరులు క్యాంపు కా ర్యాలయానికి వచ్చారు. వారందరూ సాయంత్రం ప్రజాగళం సభకు తరలివెళ్లారు.

ఇంకొల్లు: బొప్పూడి వద్ద ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు ఇంకొల్లు మండలం నుంచి ఆయా పార్టీల శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఇంకొల్లు, గంగవరం, భీమవరం, కొణికి, ఇడుపులపాడు, దుద్దుకూరు, నక్కలపాలెం, పావులూరు గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు 25 బస్సులు, 30 కార్లలో అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వెళ్లినట్లు నాయకులు తెలిపారు.

మేదరమెట్ల: బొప్పూడి వద్ద జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు టీడీపీ, జనసేన నేతలు భారీగా తరలివెళ్ళారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన తెలుగుదేశం శ్రేణులు పెద్దఎత్తున వెళ్లారు. మేదరమెట్లలో వందకుపైగా మోటరుసైకిళ్లతో ర్యాలీగా తరలివెళ్ళారు.

పంగులూరు: బొప్పూడి వద్ద ఆదివారం జరిగిన ప్రజాగళం మహాసభకు పంగులూరు మండలం నుంచి వేలాదిగా టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పలు వాహనాలలో తరలివెళ్ళారు. సుమారు వెయ్యికి పైగా ద్విచక్రవాహనాలపై టీడీపీ, జనసేనకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలతో ముప్పవరం నుండి 16వ నెంబరు జాతీయ రహదారిపై ర్యాలీగా బయలు దేరివెళ్ళారు. మండలంలోని 21 గ్రామాల నుంచి 167 కార్లు, 25 ఆటోలతో పాటు 47 బస్సులు, ట్రాక్టర్లు, టిప్పర్లు, ఇతర వాహనాలలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలసంఖ్యలో సభకు వెళ్లారు.

విమానాల ల్యాండింగ్‌కు పటిష్ట బందోబస్తు

» ఎస్పీ వకుల్ జిందాల్

మేదరమెట్ల, మార్చి 17: కొరిశపాడు మండల పరిధిలో 16వ నంబరు జాతీయ రహదారిపై అత్యవసర పరిస్థితిలో విమానాలు దిగడానికి ఏర్పాటుచేసిన ఎమర్జన్సీ రన్‌వేలో నేడు విమానాలు దిగనున్నాయని ఎస్పీ వకుల్ జిందాల్ తెలి పారు. కొరిశపాడు - రేణింగవరం మధ్య 4.1 కిలోమీటర్లు పొడవున అత్యవసర ల్యాండింగ్ (ఎయిర్ స్ట్రిప్) ఉంది. ఆమేరకు రన్‌వే వద్ద పటిష్ట బందోబస్తు ఏ ర్పాటు చేశామన్నారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒం టిగంట వరకు విమానాలు దిగుతాయని ఆయన అన్నారు. దీంతో జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాలను అద్దంకి వైపు మళ్లిస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వైపు వాహనాలు దారి మళ్లిస్తున్నామన్నా రు. గుంటూరు వైపు నుంచి ఒంగోలు నెల్లూరు చెన్నై వైపు వెళ్లే వాహనాలను రేణింగవరం జంక్షన్ నుంచి అద్దంకి పట్టణంలోని నామ్ హైవే మీదగా, మేదర మెట్ల వద్ద 16వ నంబరు జాతీయ రహదారిలో కలుపుతామన్నారు. అదే విధం గా ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట, గుంటూరు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలను మేదరమెట్ల నుంచి నామ్ హైవే మీదగా, అద్దంకి పట్టణం నుంచి రాణింగవరం జంక్షన్ వద్ద హైవేలో కలుపుతామన్నారు. ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళ్లే భారీ వాహనాలను మేదరమెట్ల వద్ద జాతీయ రహదారిపై హోల్డింగ్ పాయింట్‌లో నిలుపుదల చేస్తామన్నారు. గుంటూరు వైపు నుంచి ఒంగోలు చెన్నై వైపు వెళ్లే భారీ వాహనాలను మార్టూరు వద్ద జాతీయ రహ దారిపై ఉన్న హోల్డింగ్ పాయింట్‌లో నిలిపివేస్తున్నామన్నారు. వాహన డ్రైవర్లు, ఈ విషయాలను గమనించి పోలీసు సిబ్బందికి సహకరించాలన్నారు.

వైసీపీ నేతల భారీ హోర్డింగ్ కనిపించచలేదా..

అద్దంకి, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత 24 గంటలలోపు ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ స్థలాలలో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఎన్నికల కమిష న్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాలు జారీ చేశారు. అద్దంకి మున్సిపల్ అధికారులు ఆదివారం ఉదయం నుంచి పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉన్న రాజకీయపార్టీల నాయకుల ఫ్లెక్సీల తొలగిం పునకు చర్యలు చేపట్టారు.


భవానిసెంటర్‌లో తొలగించకుండా ఉంచిన వైసీపీకి చెందిన భారీ హోర్డింగ్

అయితే, భవానిసెంటర్‌లో సీఎం జగన్మోహనరెడ్డి, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డిల ఫొటోలతో ఉన్న భారీ హోర్డింగ్‌ను మాత్రం ఆదివారం రాత్రి వరకు తొలగిం చలేదు. ఈ హోర్డింగ్‌ను చూసిన పలువురు వైసీపీ నాయకుల హోర్డింగ్‌లకు ఎన్నికల కోడ్ వర్తించదా అని వ్యాఖ్యానిస్తున్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

అద్దంకిటౌన్, మార్చి 17: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమవుతున్నాయి. అద్దంకిలో ఏర్పాటుచేసిన ఆరు కేంద్రాల్లో 1098 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ఎంఈవో1 డి.గంగాధర్, ఎంఈవో2 బూదాటి సుధాకరరావు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, సెల్‌ఫోన్‌లు , ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని సూచించారు.

అద్దంకిలో సెంటర్ ఏర్పాటుచేసిన చైతన్య స్కూల్ అంటే బంగ్లా రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ కాదని, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల వెనుకవైపు ఉన్న చైతన్య స్కూల్ సి బ్యాచ్ బిల్డింగ్ అని అధికారులు పేర్కొన్నారు. శ్రీచైతన్య స్కూల్ కేంద్రంలో పరీక్ష రాసే విద్యార్థులు ఈమార్పు విషయాన్ని గమనించి సకాలంలో చేరుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ప్రముఖ వైద్యులు వెంకటేశ్వరప్రసాద్ మృతి

చీరాల, మార్చి 17: ప్రముఖ వైద్యులు డాక్టర్ పోలవరపు వెంకటేశ్వర ప్రసాద్ అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్యే బలరాం, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పలువురు ప్రముఖులు, ఆత్మీయులు, బంధువులు, స్నేహితులు వెంకటేశ్వరప్రసాద్ పార్థివ దేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


డాక్టర్ వెంకటేశ్వరప్రసాద్ మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బలరాం తదితరులు

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి గాయాలు

మార్టూరు, మార్చి 17: రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటన ఆదివారం సాయం త్రం మార్టూరులోని సర్వీసురోడ్డులో చోటుచేసుకుంది. ఈప్రమాదంలో ఓ మోటారు సైకిలిస్టు పంగులూరు మండలం బూదవాడకు చెందిన సుబ్బారావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు.

బాచిన కుటుంబం చేరికతో టీడీపీలో మరింత పెరిగిన జోష్

» రెట్టింపయిన కేడర్ ఉత్సాహం

అద్దంకి, మార్చి 17: అద్దంకి నియోజకవర్గంతో సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉన్న బాచిన కుటుంబం టీడీపీలో చేరికతో మరింత జోష్ పెరిగింది. ఇప్పటికే అద్దంకి నియోజకవర్గంలో గొట్టిపాటి రవికుమార్‌కు వచ్చే ఎన్నికలలో భారీ మెజార్టీ ఖాయంగా టీడీపీ క్యాడర్ భావిస్తున్నారు. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడుగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్న గొట్టిపాటి రవికుమార్‌కు బాచిన కుటుంబం తోడుకావటంతో టీడీపీ క్యాడర్‌లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నాలుగున్నర సంవత్సరాలు ఉండి పార్టీకి జీవం పోసినప్పటికీ ఎన్నికలలో వైసీపీ తరపున పోటీ చేసేందుకు కృష్ణచైతన్యకు అవకాశం ఇవ్వకపోవటంతో బాచిన అనుచరులు రగిలిపోయారు.

ఈనేపథ్యంలో శనివారం ఉండవల్లిలో చంద్రబాబునాయుడు సమక్షంలో బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్యలు టీడీపీలో చేరారు. బాచిన కుటుంబంతో పాటు వాళ్ళ వెన్నంటి ఉండే నియోజకవర్గంలోని పలు మండలాల నేతల తోపాటు గ్రామస్థాయి నేతలు కూడా టీడీపీలో చేరారు. దీంతో పలు కీలక గ్రామాలలో వైసీపీకి తీరని నష్టం జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వైసీపీలో కీలకనేతలుగా ఉన్న చింతల పేరయ్య, చింతా రామారావు, యర్రం శ్రీనివాసరెడ్డి, సాధినేని మస్తాన్‌రావు, రావి శ్రీధర్, సందిరెడ్డి రమేష్, రాయని సుబ్బారావు, గోరంట్ల శివాజీ, కామేపల్లి హనుమంతరావుతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. దీంతో ఆయా గ్రామాలలో వైసీపీకి నాయకత్వ సమస్య ఏర్పడగా, ఆయా గ్రామాలలో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చే అవకాశం ఉందని టీడీపీ శ్రేణులు, బాచిన వర్గీయులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో ఇప్పటివరకు చాటుమాటుగా ఉన్న పలువురు నేతలు టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ బలం రెట్టింపు కావటంతోపాటు భారీ మెజార్టీ ఖాయమని పలువురు అంచనా వేస్తున్నారు.


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న కృష్ణచైతన్య, గరటయ్య (ఫైల్)

రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగింపు

» ఎన్నికల నియమావళి నేపథ్యంలో నాయకుల విగ్రహాలకు ముసుగులు

చీరాల, మార్చి 17: ఎన్నికల నియమావళి నేపథ్యంలో పట్టణ పరిధిలో ఏర్పాటుచేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి ఆదే శాల మేరకు సిబ్బంది తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసు గులు తొడిగారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎలక్షన్ కమిషన్ నియమా లను తప్పకుండా పాటిస్తామని, అందుకు అందరూ సహకరించాలని మున్సిప ల్ అధికారులు తెలిపారు.


ముక్కోణపు పార్కు సెంటర్లో రాజీవ్ గాంధీ విగ్రహానికి ముసుగు తొడిగిన మున్సిపల్ సిబ్బంది

ఇంకొల్లు: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఇంకొల్లు మండలంలోని గ్రామాలలో రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రధాన కూడళ్లలో ఉన్న నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. ఇంకొల్లులో ఎన్టీఆర్, వైఎస్ విగ్రహాలకు ముసుగులు తొడిగారు. గ్రామాలలో పంచాయతీ సిబ్బంది పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు.

పర్చూరు: ఎన్నికల కోడ్ వెలువడిన వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. ఉరుకులు పరుగులతో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు ఏర్పాటుచేశారు. ప్రధాన రహదారులు, వ్యాపార సంస్థలు, దుకాణాల ముందు ఏర్పాటుచేసిన భారీ ఫ్లెక్సీలను ఆదివారం అధికారులు దగ్గర ఉండి తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గోడలకు అతికించి ఉన్న రాజకీయ నాయకుల చిత్రపటాలను సైతం తొలగించారు. రహదారుల వెంబడి విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు.

ఇసుకాసురుల బరితెగింపు

» రిజర్వాయర్‌కు గేట్లు ఏర్పాటుచేయకపోవటంతో నీరు నిల్వలేని వైనం
» ఇష్టారాజ్యంగా తవ్వకాలు

అద్దంకి, మార్చి 17: ఇసుకాసురులు బరి తెగించి వ్యవహరిస్తున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు మరమ్మతులు చేయకపోవటంతో రిజర్వాయర్‌కు చేరిన నీరు మొత్తం దిగువకు విడుదలవుతుంది. దీంతో రిజర్వాయర్‌లో నీటి నిల్వ అతి తక్కువగా ఉంటుంది. దీనిని అవకాశంగా తీసుకున్న ఇసుకాసురులు రిజర్వాయర్ పరిధిలో ఇసుక తవ్వకాలకు తెరలేపారు. రిజర్వాయర్ గర్భంలో ఏకంగా ఎక్స్‌కవేటర్‌లు ఏర్పాటుచేసి ఇసుక తవ్వకా


మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిధిలో ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్


అద్దంకి సమీపంలో బ్రిడ్జి వద్ద జరుగుతున్న ఇసుక తవ్వకాలు

లు చేస్తున్నారు. మణికేశ్వరం, అనమనమూరు, అద్దంకి తదితర ప్రాంతాలలో ఎక్స్‌కవేటర్‌లతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఎక్కువ లోతుతో తవ్వకాలు జరుపుతుండటంతో భవిష్యత్‌లో సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇక అద్దంకి పట్టణానికి సమీపంలో గుండ్లకమ్మ నదిపై ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా కూడా ఇసుక తవ్వకాలు గతంలో ఎన్నడూ లేనివిధంగా జోరు అందుకున్నాయి. ఎక్స్‌కవేటర్‌లతో తవ్వకాలు చేస్తుండటంతో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ లోతు తవ్వకాలు చేస్తుండటంతో సుడిగుండాలు మరింత పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇసుకాసురులు బరితెగింపుని చూసిన ప్రజలు ముక్కున వేలువేసుకుంటున్నారు. యథేచ్ఛగా గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నా ఏఇఖ్య శాఖ అధికారులు పట్టించుకోకపోవటం మరింత విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలుచేయాలి

చినగంజాం, మార్చి 17: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు పక్కాగా అమలుచేయాలని పర్చూరు ఆర్వో, బాపట్ల ఆర్డీవో జి.రవీంద్ర అన్నారు. సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో కడవకుదురు, చినగంజాం గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించిరా లేదా అనే విషయాలను ఆదివారం ఎంపీడీవో వరప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో కూర్చోవటానికి ఏర్పాటుచేసిన సిమెంట్ బల్లపై ఉన్న పేర్లు కనపడకుండా చేయాలని సూచించారు. దివంగత రాజకీయ నాయకుల విగ్రహాలకు మసుగులు వేయాలని, గ్రామాల్లో ఎక్కడా పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఉండకుండా చుడాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనిమిరెడ్డి ఎక్కడ?

» రెండు రోజులుగా కనిపించని వైసీపీ అద్దంకి అభ్యర్థి
» సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ » గాలిస్తున్న అయోధ్యరామిరెడ్డి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పానెం హనిమిరెడ్డి అదృశ్యమయ్యారు. ఆదివారం ఆయన ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉంది. దీంతో ఆపార్టీ నాయకులు ఆయన ఆచూకీ కోసం ప్రయత్నించడం ప్రారంభించారు. జగన్ ఇటీవల అద్దంకి అభ్యర్థిగా హనిమిరెడ్డిని ప్రకటించారు. రెండు రోజుల నుంచి ఆయన నియోజకవర్గంలో కనిపించడం లేదు. ప్రకటించిన అభ్యర్థులతో మాట్లాడి కొన్ని విషయాలను చేరవేసేందుకు వైసీపీ అధిష్టానం రీజనల్ కోఆర్డినేటర్లకు కొన్ని సూచనలు చేసింది. అందులోభాగంగా బాపట్ల జిల్లా కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న అయోధ్యరామిరెడ్డి ఆదివారం హనిమిరెడ్డి కోసం ప్రయత్నించగా ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆయన ఏమయ్యారంటూ మిగిలిన ముఖ్య నేతలకు అయోధ్యరామిరెడ్డి ఫోన్ చేస్తున్నారు.

ఆదివారం రాత్రికి కూడా ఆయన అందుబాటులోకి రాకపోవడంతో ప్రకాశం జిల్లాకు చెందిన కొందరు నేతలకు కూడా అయోధ్యరామిరెడ్డి ఫోన్ చేసి హనిమిరెడ్డి ఎక్కడ, ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నియోజకవర్గంలో లేరు అంటున్నారు. దీంతో వైసీపీ నేతల్లో కలవరం మొదలైంది. కొంతమంది నేతలైతే పట్టుబట్టి హనిమిరెడ్డిని రంగంలోకి తెచ్చింది రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అని, ఆయన్నే అడగాలంటూ సూచించినట్లు తెలిసింది. అభ్యర్థుల జాబితా ప్రకటించాక ఎవరికీ అందుబాటులో లేకుండా పోవడం వైసీపీ నేతల్లో పెద్ద చర్చనీయాంశమైంది. అభ్యర్థుల ప్రకటన అనంతరం నియోజకవర్గంలో చురుగ్గా పని చేయాల్సిన హనిమిరెడ్డి ముఖ్య నేతలకు కూడా అందుబాటులో లేకుండా వెళ్లడంతో వైసీపీ నేతల్లో అనేక అనుమానాలు ఆరంభమయ్యాయి.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చీరాలటౌన్, మార్చి 17: ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం జాండ్రపేట, కొత్తపాలెం, స్వర్ణ రైలుగేటు సమీపంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక బృందాలు అధిక సంఖ్యలో పాల్గొని ఓటర్లలో ధైర్యాన్ని నింపారు. ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ

చినగంజాం, మార్చి 17: స్థానిక గంగాపార్వతి సమేత చిదంబరేశ్వర స్వామి దేవస్థానంలో మహాగణపతి విగ్రహ పునఃప్రతిష్ఠ, నూతన నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. నూతన నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠను పురస్కరించుకొని దేవస్థానం ప్రాంగణంలో గణపతి పూజ, పుణ్యాహవాచన, నిత్య హోమం, నవగ్రహ హోమం, రత్నన్యాసం, ధాతున్యాసం, యంత్ర ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను రుత్వికలు దంపతులచే నిర్వహించారు. తదనంతరం నవగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజాకార్యక్రమాలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


హోమాలు నిర్వహిస్తున్న దంపతులు

టంగుటూరి జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

అద్దంకిటౌన్, మార్చి 17: ఆంధ్రుల స్వరూపం, ప్రతిభావ మూర్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని, ఆయన చరిత్ర తెలిపే పుస్తకంతో నేటి యువత స్ఫూర్తి పొందాలని విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. ఆదివారం మారంవారి సేవా సదన్‌లో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన ప్రతిభామూర్తి ప్రకాశం పంతులు పుస్తకావిష్కరణ సభ డీఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మస్తాన్‌రావు పుస్తకాన్ని ఆవిష్కరించి మొదటగా వీరవల్లి రుద్రయ్యకు అందజేశారు. ఈసందర్భంగా అద్దంకిలో ప్రకాశం పంతులు కాంస్య విగ్రహం ఏర్పాటు, అద్దంకితో ఆయన బంధం, ప్రకాశం మిత్రమండలి కృషి, అనేక విషయాలను రచయిత ఈ పుస్తకంలో పొందుపరిచి నేటి, రాబోయే తరాలకు అందించారని వక్తలు కొనియాడారు. ఈసందర్భంగా రచయిత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులను అతిథులు, ప్రకాశం మిత్రమండలి, వివిధ సంస్థల సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మిత్రమండలి అధ్యక్ష, కార్యదర్శులు లక్కరాజు చంద్రశేఖర్, కేవీ పోలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పుట్టంరాజు దంపతులను సత్కరిస్తున్న విద్యుత్‌శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, తదితరులు